విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...


PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :34 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 28 జూన్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

# వెలిగొండ ద్వారా ఈ సీజన్‌కే నీళ్లు ఇస్తాం



- దీని ద్వారా 4 జిల్లాల ప్రజలకు మారనున్న తలరాతలు
- నిర్వాసితులకూ న్యాయం చేస్తాం
- 2,351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్ల పరిహారం పంపిణీ
- ప్రాజెక్టుపై గత పాలకులది డ్రామా
- మంత్రి నిమ్మలతో కలిసి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన సీఎం చంద్రబాబు

మార్కాపురం

వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్--1 ద్వారా ఈ సీజన్ లో నీళ్లను అందిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సీఎం చంద్రబాబు శనివారం మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని గంటవానిపల్లెలో వెలిగొండ ప్రాజెక్టు పనుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఫేజ్--1 కింద 1.19 లక్షల ఎకరాలకు నీళ్లు, 4 లక్షల మందికి తాగునీరు అందిస్తాం. ఫేజ్--2 కింద 3.25 లక్షల వివరాలు 2లో..



## రూ.500 ఖర్చు చేసినా సంచి నిండట్లే

- మార్కెట్‌లో ఏది కొందామన్నా పిరమే!
- రాష్ట్రంలో పెరిగిన నిత్యావసరాల ధరలు
- ఆదాయాన్ని మించి పెరుగుతున్న ఖర్చులు
- సామాన్యులపై తీవ్ర ప్రభావం

హైదరాబాద్/అమరావతి

ఇటీవల కాలంలో మార్కెట్‌లో ధరలు చూస్తుంటే సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఓ వైపు ఇంధన ధరలు మండుతుండగా, మరోవైపు కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇలా ధరలు పెరగడంతో సామాన్యులపై తీవ్ర ప్రభావం పడుతోంది. సన్నబియ్యం, కోడి గుడ్లు, కూరగాయల ధరలు పెరిగి నెలవారీ ఖర్చులు ఎక్కువయ్యాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఆదాయం పెరగకున్నా, ఖర్చులు పెరగడంతో ఇంటి బడ్జెట్ పూర్తిగా మారుతోందని వాపోతున్నారు. రాష్ట్రంలో ఎన్నో కుటుంబాలుండగా ఇందులో మెజారిటీ ప్రజలపై ధరల భారం పడుతోంది. రోజువారీ వివరాలు 2లో..



## చిరకాల స్నేహాన్ని మరింత బలోపేతం చేసే చర్చల కోసం ఎదురుచూస్తున్నాను

- సీషెల్స్ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ
- మూడు రోజుల పాటు ఆ దేశంలో పర్యటించనున్న ప్రధాని
- కీలక అంశాలపై చర్చలు జరిపే అవకాశం
- భద్రత, శ్రేయస్సును పెంపొందించడానికి భారత్, సీషెల్స్ కలిసికట్టుగా కృషి చేస్తాయి



## ఇది యువత భవిష్యత్తును దొంగిలించడమే

- టెట్ పేపర్ లీక్‌పై రాహుల్ గాంధీ ఫైర్
- దేశంలోని విద్యా వ్యవస్థను దోపిడీ వ్యవస్థగా మార్చేశారన్న కాంగ్రెస్ అగ్రనేత
- ప్రశ్నాపత్రాల లీక్ వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందన్న రాహుల్
- టెట్ ప్రశ్నపత్రాల సెట్‌ను రూ.1.5 కోట్లకు ఒప్పందం కుదిరినట్లు గుర్తించిన పోలీసులు

## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

- గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన కేంద్రమంత్రి
- రాబోయే రెండేళ్లలో దేశంలోని 500కు పైగా నగరాలకు సేవలు విస్తరించనున్నట్లు ప్రకటన
- ఈ జులై 31 లోపు ఏడు ప్రధాన నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడి
- డ్రైవర్లను భాగస్వాములుగా చేసే సహకార నమూనాతో ఈ ప్లాట్‌ఫామ్ పనిచేస్తుందన్న అమిత్ షా
- 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే ప్రధాని మంత్రాన్ని సాకారం చేస్తున్నట్లు వ్యాఖ్య





## రీసెర్చ్ పేపర్ల ఉపసంహరణ

- ప్రపంచంలో చైనా తర్వాత భారత్ రెండో స్థానం
- ఉపసంహరణలో గ్లోబల్ టాప్ 10 జాబితాలో ఆరు భారత యూనివర్సిటీలు
- చెన్నై అన్నా యూనివర్సిటీకి తొలి స్థానం, హైదరాబాద్ జేఎన్‌టీయూకు ఐదో ర్యాంక్
- నాణ్యతను పక్కనపెట్టడమే ప్రధాన కారణం



## పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే వారికే పదవులు

- జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో పవన్ కల్యాణ్
- అన్ని కులాలను కలుపుకుని వెళ్తేనే మనుగడ సాధించగలమని కార్యకర్తలకు సూచన
- ఏ ఉద్యమమైనా కొత్త తరానికి విస్తరించాలి
- జనసేన పార్టీలో 18 వేలమంది సాధక్‌లు ఉన్నారు
- ఏ ఉద్యమమైనా కొత్త తరానికి విస్తరించాలని, లేకుంటే ఎదుగుదల ఉండదు




అమరావతి

పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే వారికి మరిన్ని పదవులు దక్కుతాయని పవన్? స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను గుర్తించి వారి ఎదుగుదలకు సహాయం చేస్తామని జనసేన అధినేత పవన్? కల్యాణ్? అన్నారు. మంగళగిరిలో నిర్వహించిన జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశానికి హాజరైన జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జనసైనికులకు పలు సూచనలు చేశారు. జనసేవ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యుల ఎంపిక గురించి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వారి వివరాలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత వివరాలు 2లో..



## నిజమైన శివసైనికులు నాతోనే ఉన్నారు

- రెబల్ ఎంపీలపై ఉద్ధవ్ ఠాక్రే ఫైర్?
- తిరుగుబాటు ఎంపీలపై ఉద్ధవ్ ఠాక్రే ఘాటు వ్యాఖ్యలు
- తిరుగుబాటు ఎంపీల నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు ప్రకటన
- రూ.50 కోట్లకు ఎంపీ అమ్ముడుపోయారని సంజయ్ దేశ్‌ముఖ్‌పై ఆరోపణలు

## ఫేస్‌బుక్ కామెంట్‌కు కిడ్నాప్, హత్యాయత్నం

- వైసీపీ నేతలపై హోంమంత్రి అనితకు బాధితుడి ఫిర్యాదు
- ఫేస్‌బుక్ కామెంట్‌పై భూమన అనుచరులు కిడ్నాప్ చేశారని బాధితుడి ఆరోపణ
- నాలుక కోసి, నరాలు కట్ చేసి చంపేందుకు యత్నించారని ఫిర్యాదు
- సజ్జల ఫోన్‌తో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చారని ఆవేదన
- టీడీపీ గ్రీవెన్స్‌లో హోంమంత్రి అనితకు బాధితుడు పత్తి మణి అర్జీ
- తనపైనే అక్రమ కేసులు పెట్టి, కుటుంబాన్ని వేధించారని ఆరోపణ



అమరావతి

ఫేస్‌బుక్‌లో పెట్టిన ఓ కామెంట్‌కు ప్రతిగా తనను కిడ్నాప్ చేసి, చంపేందుకు ప్రయత్నించారని ఆరోపిస్తూ ఓ బాధితుడు ప్రస్తుత హోంమంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా రాజంపేట మండలం మన్నూరు గ్రామానికి చెందిన పత్తి మణి, మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో హోంమంత్రితో పాటు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.డి. నజీర్‌కు తన గోడును విన్నవించారు. బాధితుడు పత్తి మణి తెలిపిన వివరాల ప్రకారం, 2023 జూన్ 9న నాటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి, వివరాలు 2లో..



## కేంద్ర మంత్రికి రూ.99 లక్షల సబ్సిడీ..

- సొంత శాఖ నుంచే లబ్ధిపై వివాదం!
- ఇదో కొత్త తరహా అవినీతి అంటూ విపక్షాల తీవ్ర విమర్శ
- తాను రైతునేనని, 2018లోనే దరఖాస్తు చేసుకున్నానని మంత్రి వివరణ
- కోటి రూపాయలు మంజూరు చేయించుకోవడమేమిటని గెహ్లోట్ విమర్శలు

# రూ.500 ఖర్చు చేసినా సంచి నిండట్లే

-మొదటిపేజీ తరువాయి

కూలీలు, ఆటో డ్రైవర్లు, చిన్న ఉద్యోగులు, పింఛన్‌పై ఆధార పడేవారు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**సన్నబియ్యం షాక్**

గత నెలలో 26 కిలోల సన్నబియ్యం సంచి రూ.1,400 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.1600 నుంచి రూ.1700ల వరకు చేరింది. ఒక్కో కుటుంబానికి నెలకు రూ.200 నుంచి రూ.250 వరకు అదనపు భారం పడుతోంది. గడిచిన 20 రోజుల్లోనే 15 నుంచి 20 శాతం వరకు ధరలు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. అలాగే రాష్ట్రాల్లో ఇతర ఉత్పత్తి తగ్గడంతో పాటు తెలంగాణలో సన్నాలకు బోనస్ ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేయడంతో మార్కెట్లోకి వచ్చే ధాన్యం తగ్గిపోయింది. పలు జిల్లాలో ఎక్కువగా వినియోగించే జైశ్రీరాం, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ, బీపీటీ రకాల ధరలు పెరిగాయి.

**ఇతర రాష్ట్రాల నుంచి విక్రయాలు**

మార్కెట్లో ఉల్లి ధర ఘాటెక్కి కిలో రూ.40కి చేరింది. రూ.30 వరకు కిలో ఉన్న టమాట పది రోజుల క్రితం రూ.60 వరకు చేరి ఇప్పుడు రూ.40కు చేరింది. పచ్చి మిర్చి, పప్పులు, వంటనూనె ఇలా వంటింటి ధరలు ప్రతి ఇంటింటా సెగలు పుట్టిస్తున్నాయి. వర్షాలు సకాలంలో కురవకపోవడం, రవాణా ఖర్చుల భారం, రైతులు కూరగాయల సాగు తగ్గించడం మూలంగా ఉమ్మడి కరీంనగర్? జిల్లాలో కూరగాయల ధరలు పెరుగుదలకు కారణమవుతున్నాయి. టమాట ఏపీ నుంచి, ఉల్లి మహారాష్ట్ర నుంచి, కీరదోస, క్యారెట్? బెంగళూరు, పచ్చిమిర్చి అనంతపురం, ఆలుగడ్డ హైదరాబాద్? నుంచి వస్తున్నాయి. వంటిమామిడి మార్కెట్ నుంచి కూడా పలు కూరగాయలను హోల్?సేల్?గా తెచ్చి విక్రయిస్తున్నారు.

**కొండెక్కిన కోడిగుడ్డు**

కోడిగుడ్ల ధర పెరుగుతుండటంతో సామాన్య, మధ్య తరగతి



కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. అయితే ఇటీవల ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడం కారణంగా పోషకాహారం కోసం గుడ్ల వినియోగం విపరీతంగా పెరిగింది. గతంలో రూ.5 నుంచి రూ.6 వరకు ఉన్న గుడ్డు ధర ప్రస్తుతం రూ.7 నుంచి రూ.8 వరకు పెరగడం వల్ల ఇది కాస్త నెలవారీ ఖర్చులపై ప్రభావం చూపుతోంది. మరోవైపు కోళ్లదాణా ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి ఖర్చు పెరగడం మూలంగానే గుడ్ల ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

**మరింత పెరిగే అవకాశం**

ఇవి తెలంగాణ రాష్ట్రం నుంచి పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, అస్సాం రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఏప్రిల్‌లో యుద్ధం కారణంగా గుడ్ల ధరలు పడిపోయాయి. ఒక గుడ్డు ఉత్పత్తి కావాలంటే రైతుకు కనీసం సరాసరి రూ.5.50 ఖర్చు వస్తుంది. ఏప్రిల్?లో రైతులు రూ.3.50కే విక్రయించారు. మే నెలలో రూ.5.60కు, జూన్? 18 నుంచి రూ.6.35కు విక్రయిస్తున్నారు. ఇది మార్కెట్‌లోకి వచ్చేసరికి గుడ్డపై రూపాయి నుంచి రూ.1.20కు పెరుగుతుంది. అయితే రానున్న రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందని కోళ్ల రైతులు చెబుతున్నారు.

# 5న భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభం

**విజయనగరం :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, నవ్యాంధ్రప్రదేశ్ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. జూలై 5న భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని అత్యంత వైభవంగా ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుని, రికార్డు సమయంలో పనులను పూర్తి చేయించారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తుది అధికారిక షెడ్యూల్ ఆమోదం కోసం రాష్ట్ర అధికార యంత్రాంగం ప్రస్తుతం వేచి చూస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్న విమానాశ్రయం ఐఎన్ఎస్ డేగా నేవీ రక్షణ పరిధిలో ఉండటం వల్ల అంతర్జాతీయ సర్వీసులకు, రాత్రి వేళల్లో విమానాల రాకపోకలకు అనేక సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా జీఎమ్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించారు. అత్యాధునిక రన్‌వే, అంతర్జాతీయ కార్గో టెర్మినల్, ఏకకాలంలో పదుల సంఖ్యలో విమానాలు పార్క్ చేసే ఏప్రాన్ సౌకర్యాలతో ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ రూపుదిద్దుకుంది. ఇది అందుబాటులోకి వస్తే ప్రపంచ దేశాల నుండి నేరుగా విశాఖకు విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయిభోగాపురం విమానాశ్రయం కేవలం ప్రయాణికుల రాకపోకలకే పరిమితం కాకుండా, ఉత్తరాంధ్ర ఆర్థిక వృద్ధికి ఒక ప్రధాన చోదక శక్తిగా మారబోతోంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న ఫార్మా హబ్‌లు, ఐటీ కారిడార్లు, అక్వా రంగానికి ఈ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ కార్గో సేవలు విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయి. ఇక్కడి ఉత్పత్తులను నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు వీలవుతుంది. దీనివల్ల వందలాది గ్లోబల్ కంపెనీలు ఉత్తరాంధ్ర వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని, తద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు వీలుగా



ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన సిక్స్ లేన్ బీచ్ కారిడార్ రోడ్డు పనులను కూడా వేగవంతం చేసింది. ఈ కనెక్టివిటీ వల్ల భోగాపురం పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి రెక్కలు వచ్చాయి. అలాగే రుషికొండ, భీమిలి, తొట్లకొండ తీరప్రాంతాలు గ్లోబల్ టూరిజం స్పాట్స్‌గా మారబోతున్నాయి. అంతర్జాతీయ పర్యాటకులు నేరుగా ఇక్కడికి చేరుకునే వీలుండటంతో హోటల్, హాస్పిటాలిటీ రంగాలు ఊపందుకోనున్నాయి.గతంలోనే ఈ ప్రాజెక్టుకు బీజం వేసిన చంద్రబాబు నాయుడు, మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం పనులపై ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించారు. నిధుల కొరత లేకుండా చూస్తూ, నిర్మాణ సంస్థ జీఎమ్ఆర్‌పై ఒత్తిడి తెచ్చి పనులను పరుగులు పెట్టించారు. పౌర విమానయాన శాఖ నుంచి అవసరమైన అన్ని రకాల అనుమతులు, ట్రయల్ రన్స్‌ను ఇప్పటికే విజయవంతంగా పూర్తి చేశారు. జూలై 5న ఈ మెగా ప్రాజెక్ట్‌ను ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించి, తమ ప్రభుత్వ డెవలప్‌మెంట్ విజన్‌ను దేశవ్యాప్తంగా చాటాలని కూటమి భావిస్తోంది. ఎయిర్‌పోర్ట్ రన్‌వే, టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ పనులు వంద శాతం పూర్తవడంతో పీఎమ్ఓ నుంచి క్లియరెన్స్ రాగానే అధికారికంగా ప్రారంభోత్సవ తేదీని ప్రకటించనున్నారు. ప్రధాని మోదీ పర్యటన ఖరారైతే.. అదే రోజు ఉత్తరాంధ్రలో మరికొన్ని కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ సిద్ధం చేస్తోంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం అనేది నవ్యాంధ్రప్రదేశ్ జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి ఒక మైలురాయి కాబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదని సామాన్య ప్రజల భావన.

# జూలై మూడు నుంచి అక్షర గోవిందం

**తిరుమల :** చిన్నారుల తల్లిదండ్రులకు తిరుమల తిరుపతి దేవస్థానం మంచి అవకాశం కల్పిస్తోంది. శ్రీవారి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన నిర్వహించుకునే సదుపాయం కల్పిస్తోంది. అక్షర గోవిందం పేరుతో జూలై మూడో తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు టీటీడీ తెలిపింది. ఆసక్తి గల తల్లిదండ్రులు వకుళామాత ఆలయానికి గంట ముందుగా చేరుకుని నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కార్యక్రమంలో భాగంగా టీటీడీ ఉచితంగా కిట్లు కూడా అందించనుంది.తిరుమల తిరుపతి దేవస్థానం మరో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. జూలై మూడో తేదీ నుంచి అక్షర గోవిందం కార్యక్రమం ప్రారంభించనుంది. చిన్నారులలో సనాతన ధర్మంపై ఆసక్తి పెంచటం, వారి విద్యాభ్యాసం శుభప్రదంగా సాగాలనే ఉద్దేశంతో అక్షర గోవిందం, అన్న ప్రాశన కార్యక్రమాలను జూలై మూడో తేదీ నుంచి టీటీడీ ప్రారంభించనుంది. తిరుపతిలోని వకుళామాత ఆలయంలో అక్షర గోవిందం , అన్నప్రాశన కార్యక్రమాలు ప్రారంభ కానున్నాయి. జూలై మూడో తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి 12 గంటల 30 నిమిషాల వరకూ వకుళామాత ఆలయంలో సంప్రదాయబద్ధంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం జరుగుతుంది. అక్షరాభ్యాసం పూర్తి అయిన తర్వాత ఆశీర్వచనం, ప్రసాదం, ప్రత్యేకంగా రూపొందించిన అక్షర గోవిందం కిట్ టీటీడీ అందిస్తుంది.అక్షర గోవిందం కార్యక్రమంలో పాల్గొనేందుకు మూడు నుంచి ఐదేళ్లలోపు వయసు ఉన్న చిన్నారులు అర్హులు.



ఇక అక్షరాభ్యాసం పూర్తయిన తర్వాత అందించే అక్షర గోవిందం కిట్‌లో టీటీడీ వివిధ వస్తువులను చేర్చింది. రాతపలక, బలపంతో పాటుగా శ్రీవారి అక్షింతలు, కంకణం, పసుపు, కుంకుమ, వకుళామాత, వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారు సరస్వతీ దేవి చిత్రపటాలు ఉంటాయి. అలాగే గోవిందనామాలు, శ్రీవారి సుప్రభాతం, పెద్దబాలశిక్ష వంటివి ఉచితంగా అందిస్తారు. అక్షరాభ్యాసంతో పాటుగా వకుళామాత ఆలయంలో వేదమంత్రోచ్చారణల మధ్య చిన్నారులకు అన్నప్రాశన కూడా నిర్వహిస్తారు.మరోవైపు అక్షర గోవిందం కార్యక్రమంలో పాల్గొనేందుకు ముందస్తు అనుమతి తప్పనిసరి. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు గంట ముందుగానే వకుళామాత ఆలయానికి చేరుకుని ఆలయ ప్రాంగణంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని టీటీడీ తెలిపింది. అలాగే జూలై నాలుగో తేదీ నుంచి మంగళవారం మినహా మిగతా వారం రోజులూ వకుళామాత ఆలయంలో శుభ ముహూర్తంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.రోజుకు 50 మంది చిన్నారులకు... బ్యాచ్‌కు 25 మంది చొప్పున రెండు బ్యాచులలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. అలాగే అక్షర గోవిందం కార్యక్రమానికి హాజరయ్యే చిన్నారులు తల్లిదండ్రులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరుకావాల్సి ఉంటుందని టీటీడీ తెలిపింది

## వెలిగొండ ద్వారా ఈ సీజన్‌కే నీళ్లు ఇస్తాం

-మొదటిపేజీ తరువాయి

ఎకరాలకు సాగునీరు, 11.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని.. అలాగే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని.. ఇందుకు తనది గ్యారెంటీ ఆంటూ ముఖ్యమంత్రి ప్రకటించారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి 2,351 మంది నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిమిత్తం రూ.300 కోట్ల విలువైన చెక్కును ముఖ్యమంత్రి అందించారు. ప్రాజెక్టు పరిధిలోని రైతులు, నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు చరిత్ర... మార్కాపురం జిల్లా అభివద్ధి ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రాజెక్టుకు భూములివ్వడం అంటే త్యాగం చేసినట్టే. పూర్వీకుల నుంచి వచ్చిన భూములను ప్రాజెక్టు కోసం వదులుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు నాలుగు జిల్లాల తలరాతను మారుస్తుంది. ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్యలు ఉన్నాయి.. దీంతో ఇక్కడి స్థానికులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. మార్కాపురం ప్రాంతం అంటే కరవు ప్రాంతమని పేరు... ఈ ప్రాంతానికి కృష్ణా నీళ్లు వస్తాయని ఎవ్వరూ అనుకోలేదు. మార్కాపురం ప్రాంతానికి కష్ణా నీళ్లిచ్చేందుకు ఎన్టీఆర్ 1985లోనే ఆలోచన చేశారు... దీని కోసం ఓ కమిటీని వేశారు. ఎన్టీఆర్ హయాంలోనే వెలిగొండ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 1995లో ప్రకాశం జిల్లా పర్యటనకు ఎప్పుడు వచ్చినా వెలిగొండ ప్రాజెక్టు గురించే అడిగేవాళ్లు. వరద వస్తే.. ఆ జలాలను మళ్లిస్తే ఆ నీళ్లతో తాము జీవనం సాగిస్తామని ఇక్కడి రైతులు చెప్పేవారు. 1996లో వెలిగొండకు శంకుస్థాపన చేశాం. వెలిగొండ ప్రాజెక్టుకు ప్రస్తుత లెక్కల ప్రకారం రూ.10,580 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటి వరకు రూ.6,736 కోట్లు ఖర్చు చేశాం... ఇంకా రూ.3,844 కోట్లు ఖర్చు పెట్టాలి. రూ.1,932 కోట్లు తొలి విడతలో ఖర్చు పెట్టాలి... రూ.1906 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంది. 2024లో ప్రభుత్వం వచ్చాక రూ.759 కోట్లు ఖర్చు చేశాం... నిర్వాసితుల కోసం రూ.905 కోట్లు మంజూరు చేసి రూ.300 కోట్లు విడుదల చేశాం. ప్రస్తుతం బ్యాంకులకు శెలవులు ఉన్నందున మరో రెండు రోజుల్లో నిర్వాసితుల ఖాతాల్లో ఆర్ అండ్ ఆర్ డబ్బులు జమ అవుతాయి. ఆర్థికంగా ఇబ్బందులున్నాయి... అయినా వెలిగొండ సహా వివిధ ప్రాజెక్టులను ప్రాధాన్యతల వారీగా పూర్తి చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన రైతులు, నిర్వాసితుల జీవితాలు మెరుగ్గా ఉంటాయి. 2,351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్లు జమ చేస్తున్నాం. కలనూతల, సుంకేశుల, చింతలముడిపి, బుడుంచెర్ల, కాటంరాజు తండా, సాయిరాం నగర్, మెట్టి గొంది, బసవాయిపల్లి, లక్ష్మీపురం, అక్కచెరువు, గొట్టిపాడు గ్రామాల నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ నిధులు ఇస్తున్నాం. మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టు వద్దే ఉంటున్నారు. టన్నెల్లోకి వెళ్తున్నారు. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి... రాష్ట్రం విధ్వంసమైంది. శాంతి భద్రతలకు తీవ్రమైన విఘాతం కలిగించేలా వ్యవస్థలను నిర్వర్యం చేశారు. పరిశ్రమలను తరిమేశారు.. పెట్టుబడులు రాకుండా అడ్డుకున్నారు... అప్పుల భారాన్ని పెంచారు. గడచిన ప్రభుత్వం వెలిగొండ పనులు చేపట్టి ఉంటే నీళ్లు ఎప్పుడో వచ్చేవి. కూటమి ప్రభుత్వం వచ్చాకే పెద్ద ఎత్తున పనులు చేపట్టాం. గత పాలకులు వెలిగొండ ప్రాజెక్టు విషయంలో డ్రామాలాడారు.. మోసం చేశారు. మోసం చేయడంలో గొడ్డలి పార్టీ దిట్ట.. కళ్లార్పకుండా అబద్దాలు చెబుతారు... తేరుకునేలోపే మోసం చేసేస్తారు. మోసాలు ఎలా చేస్తారో.. ప్రజలను ఏ విధంగా ఏమారుస్తారోననే విషయంపై అవగాహన కల్పించేందుకు గొడ్డలి పార్టీ చర్యలను వివరిస్తూ మ్యూజియంలో పెట్టాలి. గొడ్డలి పార్టీకి బుద్ధి చెప్పాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ శ్రీనివాసులు రెడ్డి సహా జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, నేతలు పాల్గొన్నారు.

## పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే వారికే పదవులు

-మొదటిపేజీ తరువాయి

అని పవన్ అన్నారు. కమిటీల ఎంపికపై కొందరు విమర్శలు చేస్తున్నారని, అది సరికాదని తెలిపారు. ఎన్నేళ్లుగా కష్టపడుతున్నారనే దాన్ని బేరీజు వేసుకునే ఎంపిక జరిగిందన్నారు. కమిటీలో ఉన్నవారికి త్వరలోనే విధివిధానాలు అందిస్తామన్నారు.

**ఏ ఉద్యమమైనా కొత్త తరానికి విస్తరించాలి**

క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని పవన్ దృష్టికి తేవాలన్నారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించాలని, అటువంటి కార్యకర్తలను నాయకత్వం గుర్తించకపోతే ఎలా? అని పవన్ హితవు పలికారు. కార్యకర్త ఎదిగేందుకు మనమంతా సాయం చేయాలని, నిజమైన కార్యకర్తలపై ప్రేమ, అభిమానం చూపించాలన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించే వారికి గుర్తింపు ఇస్తామన్నారు. పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే వారికి మరిన్ని పదవులు వస్తాయని స్పష్టం చేశారు. జనసేన పార్టీలో 18 వేలమంది సాధక్‌లు ఉన్నారన్నారు. ఏ ఉద్యమమైనా కొత్త తరానికి విస్తరించాలని, లేకుంటే ఎదుగుదల ఉండదని పవన్? తెలిపారు. తాను? చెప్పినట్లు ముందుకెళ్తే జనసేనకు కోటిమంది సభ్యులు ఉండేవారని, పార్టీ మహావృక్షంగా ఎదిగితే ఆ కొమ్మలపై మీరు కూర్చోవచ్చని పవన్ కల్యాణ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 'కులాలతో రాజకీయాలు చేయను. చేయబోను. పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు దక్కుతాయి. అన్ని కులాలను కలుపుకుని వెళ్తేనే మనుగడ సాధించగలం. నేనెప్పుడూ కులాలను రాజకీయాలకు పెట్టుబడి పెట్టను. క్షేత్రస్థాయిలో పనిచేసే వారి వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తాం. సమాచారాన్ని పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత. దేశవ్యాప్తంగా ఎస్టీ, ఎస్సీ, బీసీల పేరుతో హాస్టళ్లు ఉండకూడదు. పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నా. కులాలను కలపడం తప్ప విడగొట్టడం నాకు రాదు.' -పవన్ కల్యాణ్, జనసేన పార్టీ అధినేత?

**సంక్షేమంపైనే ఆధారపడితే ఓట్లు రావు**

వైఎస్సార్సీపీ నేతలు ఎప్పుడూ వ్యక్తిగతంగా దూషిస్తారని పవన్ ధ్వజమెత్తారు. 11 సీట్లు వచ్చినా వారు అలాగే మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సంక్షేమంపైనే ఆధారపడితే ఓట్లు రావని అభివృద్ధి కూడా చేయాలని సూచించారు. అందుకే వైఎస్సార్సీపీ బటన్ నొక్కినా ఓట్లు రాలేదని పవన్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు సరిగా పనిచేయకే ప్రజలు ప్రైవేటుకు వెళ్తున్నారని, అందుకే ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయాలని పదేపదే చెబుతున్నానన్నారు. కేంద్రం జల్‌జీవన్ మిషన్ నిధులిచ్చినా పనులు చేయాల్సింది రాష్ట్రాలేనని గుర్తు చేశారు.

**కులం వెనుక దాక్కోవద్దు**

50 శాతం ఉన్న బీసీలకు ఒకరు ఇచ్చేదేంటి, కలిసి ఉంటే వాళ్లే ఇతరులకు ఇవ్వొచ్చు అని పవన్ అన్నారు. కులం అనే భావన ఎప్పుడూ ఇంటిగడప లోపలే ఆగాలని, గడప దాటాక మన సంస్కృతి, భాష, ధర్మం పాటించాలని సూచించారు. కృష్ణలంకలో చనిపోయిన రౌడీకి కులం అంటగట్టడమేంటని ప్రశ్నించారు. సాయికృష్ణ తల్లి బాధను అర్థం చేసుకోగలనన్నారు. తనను తిట్టేవాళ్లలో ఎక్కువమంది కాపు నాయకులే ఉన్నారని, ఎవరి భుజంపై తుపాకీ పెట్టి కాలుస్తున్నారో అందరూ చూస్తున్నారని వివరించారు. ఇష్టం వచ్చినట్లు తిట్టి, నేరాలు చేసి, కులం వెనుక దాక్కోవద్దని హెచ్చరించారు.

## ఫేస్‌బుక్ కామెంట్‌కు కిడ్నాప్, హత్యాయత్నం..

-మొదటిపేజీ తరువాయి

"నారా లోకేశ్, పవన్ కల్యాణ్‌లను తిరుపతిలో అడుగుపెట్టనివ్వం" అని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన తాను.. "ఇది రాచరిక పాలన కాదు, ప్రజాస్వామ్యం. ఎవరైనా ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చు... మీరు నందలూరు నుంచి తిరుపతి వెళ్లలేదా?" అని కామెంట్ పెట్టినట్టు వెల్లడించారు. ఈ కామెంట్‌ను మనసులో పెట్టుకున్న భూమన అనుచరుడు రాజు మరికొందరితో కలిసి జూన్ 11న రాజంపేటలోని హరిత హోటల్ వద్ద తనపై దాడి చేసి, బలవంతంగా కారులో కిడ్నాప్ చేశారని మణి ఆరోపించారు. కారులోనే తన నాలుక కోసి, చేతి నరాలు కట్ చేసి, కళ్లపై రాళ్లతో కొట్టి చంపేందుకు ప్రయత్నించారని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి చేస్తున్న సమయంలో నిందితులు నాటి ఎమ్మెల్యే భూమనకు, ఆయన కుమారుడికి వీడియో కాల్ చేసి చూపించగా.. అవతలి నుంచి "వీడిని బాగా కొట్టి, చంపేసి అలిపిరి అడవిలో పారేయండి" అని ఆదేశాలు ఇచ్చారని మణి సంచలన ఆరోపణలు చేశారు. అయితే, పోలీసులు తమను వెతుకుతున్నారని తెలిసి నిందితులు పరారయ్యేందుకు ప్రయత్నించగా, చిట్వేలి వద్ద పోలీసులు వారిని పట్టుకుని తనను రక్షించారని తెలిపారు. అయితే అసలు కథ ఇక్కడే మొదలైందని, నిందితులను మన్నూరు పోలీస్ స్టేషన్‌కు తరలించగానే నాటి వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి డీఎస్పీకి ఫోన్ చేశారని, దీంతో నిందితులకు వెంటనే స్టేషన్ బెయిల్ ఇచ్చి, రాత్రి 2 గంటలకు పోలీస్ సెక్యూరిటీతో తిరుపతికి పంపించేశారని మణి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత, చావుబతుకుల మధ్య ఉన్న తనపైనే పోలీసులు అక్రమ కేసులు పెట్టారని, తన భార్యను, 3 ఏళ్ల కుమారుడిని పోలీస్ స్టేషన్‌లో 4 గంటల పాటు అక్రమంగా నిర్బంధించారని వాపోయారు. ఈ అన్యాయంపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆయన హోంమంత్రిని కోరారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ పరిటాల.

- ప్రతి సమస్యకు జవాబుదారీగా ఉంటాం.
- ప్రతి ఫిర్యాదును పీజీఆర్ఎస్ కు అందజేస్తున్నాం.
- సర్ పై నిర్లక్ష్యం వీడి అర్హులైన ప్రతి ఒక్క ఓటును ఓటరు జాబితాలో వచ్చేలా చూడండి.
- సర్ పై నియోజకవర్గ ముఖ్య నాయకులతో మాట్లాడిన శ్రీరామ్.







**ధర్మవరం, పెన్ సత్తా, జూన్ 27:**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని పరిటాల శ్రీరామ్ తెలియజేశారు. ధర్మవరం పట్టణం ఎర్రగుంట సర్కిల్లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ ప్రజా దర్బార్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం పట్టణం రూరల్ లో గల ప్రజలు పలు సమస్యల పై పరిటాల శ్రీరామ్ కు అర్జీలు అందజేశారు. ఫిర్యాదు దారుల సమస్యలను విన్న పరిటాల శ్రీరామ్ ప్రతి సమస్యకు జవాబుదారితనంగా తెలుగుదేశంపార్టీ ఉంటుందని, మీరు ఇచ్చిన ప్రతి సమస్యను పీజీ ఆర్ఎస్ ద్వారా ఆన్లైన్లో ప్రభుత్వానికి అందజేస్తున్నామని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామని పరిటాల శ్రీరామ్ ఫిర్యాదు దారులకు తెలియజేశారు. అదే విధంగా నియోజకవర్గంలో గల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో పరిటాల శ్రీరామ్ సర్ పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)కార్యక్రమం జరుగుతున్న తీరు పై పట్టణ, మండలాల వారీగా తెదేపా నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులకు పరిటాల శ్రీరామ్ ప్రత్యేక సూచనలు చేశారు. పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ సర్ పై నిర్లక్ష్యం వీడి, పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీముఖ్య నాయకులు సర్ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని అర్హులైన ఏ ఒక్కరి ఓటు ఓటరు జాబితా నుండి తొలగించకుండా చూడాలని, సర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రాతిష్టాత్మకంగా తీసుకొని ముందుకెళ్లాలని ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ పార్టీ నాయకులకు తెలియజేశారు. ధర్మవరం నియోజకవర్గంలో ఓటరు మ్యాపింగ్ డిజిటలైజేషన్ లో ధర్మవరం నియోజకవర్గం పూర్తిస్థాయిలో వెనుకబడి ఉందని బూత్ లెవెల్ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడువులోగా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యేటట్లు చూడాలని పరిటాల శ్రీరామ్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

# జిల్లాలో ఘనంగా ప్రారంభ మైన ‘అనంత అరణ్య’ కార్యక్రమం.







జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 27**: పర్యావరణ పరి రక్షణే ధ్యేయంగా, భవిష్యత్తు తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించేందుకు జిల్లాలో గొప్ప సంకల్పానికి శ్రీకారం చుట్టామని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. శనివారం ఉదయం కశింకోట మండలం, తాళ్లపాలెం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం (బాలికలు)లో మొక్కలు నాటి నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లో భాగంగా అనంత అరణ్య కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలాలంకరణ చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతిని పరి రక్షిద్దాం....భవిష్యత్తును కాపాడుదాం అనే ప్రధాన లక్ష్యంతో విద్యాసంస్థల క్యాంపస్‌లలో పచ్చదనాన్ని పెంపొందించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో మొక్కల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటి పర్యావరణాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు. నెట్ జీరో హెల్తీ క్యాంపస్ కార్యక్రమం కింద రెసిడెన్షియల్ హాస్టల్స్ ఆవరణలో చేపట్టే ప్లాంటేషన్ కార్యక్రమంలో మొత్తం 1,00,000 (లక్ష) మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, హాస్టల్ స్థల పరిమాణాన్ని బట్టి సుమారు 1,625 నుండి 6,500 వరకు మొక్కలు నాటడం జరుగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థినులకు ఆహ్లాదకర మైన, స్వచ్ఛ మైన, ఆరోగ్యకర మైన వాతావరణాన్ని అందించేలా క్యాంపస్ లను తీర్చిదిద్దాలన్నారు. ఈ రోజు మొక్క నాటండి... రేపటి తరాలకు జీవం అందించండి అనే నినాదంతో ప్రకృతితో కలిసి సుస్థిరమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమం ఎంజిఎన్ఆర్ఈజిఎస్, వీబీ జి రామ్ జి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డిడబ్ల్యుఎంఏ), సంయుక్త ఆధ్వర్యంలో పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ పర్యావరణ చైతన్య కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్, ఇతర జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గురుకుల పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు మొక్కలను నాటే ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్నారు.

# నేర పరిశోధనలో ఫోరెన్సిక్ సైన్స్ కీలక పాత్ర పోషిస్తుంది.

జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్.








**విజయనగరం, పెన్ సత్తా, జూన్ 27:** జిల్లా లోని సెంచూరియన్ యూనివర్సిటీలో క్రిమినల్ ప్రాసిక్యూషన్‌లో ఫోరెన్సిక్ సైన్స్ పాత్ర పై ప్రాసిక్యూటర్లకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యూనివర్సిటీ డీన్, ప్రో. కే.వి.రవి కుమార్ జిల్లా ఎస్పీ కి పూల బోకేతో స్వాగతం పలికారు. ముందుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ జ్యోతి ప్రజ్వలనతో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ మారుతున్నటువంటి నేరాలకు అనుగుణంగా నేటి ఆధునిక దర్యాప్తు వ్యవస్థలో ఫోరెన్సిక్ సైన్స్ కీలక పాత్ర పోషిస్తోందని, శాస్త్రీయ ఆధారాలు నేరాల విచారణను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా నిరూపించడంలో ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం నేరస్థలం భౌతిక విధానం నుండి డిజిటల్ విధానంకు మారిపోతుందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా నేరస్థులకు శిక్ష పడేలా పటిష్ట మైన ఆధారాలను సేకరించవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. ఒక ప్రత్యక్ష సాక్షి చెప్పే సాక్ష్యం కన్నా నేరం జరిగిన ప్రదేశం నుంచి సేకరించే ఆధారాలు, ఫింగర్ ప్రింట్స్, డీఎన్ఏ, సీసీటీవీ ఫుటేజీలు, ఇతర శాస్త్రీయ సాక్ష్యాలు కేసుల దర్యాప్తులో కీలక పాత్ర పోషిస్తాయని, నేర నిరూపణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని జిల్లా ఎస్పీ వివరించారు. దర్యాప్తు అధికారులు సేకరించిన ఆధారాలను న్యాయస్థానాల్లో సరైన విధంగా ప్రవేశపెట్టడంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు, మహిళలు మరియు చిన్నారుల పై జరిగే నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫోరెన్సిక్ సైన్స్ వినియోగం మరింత అవసర మైందని ఎస్పీ తెలిపారు. డిజిటల్ ఆధారాల విశ్లేషణ, సైబర్ ఫోరెన్సిక్, మొబైల్ ఫోరెన్సిక్ వంటి విభాగాల్లో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం పై పోలీస్, ప్రాసిక్యూషన్ అధికారులు మరింత అవగాహన పెంచు కోవాలని సూచించారు. కొత్త చట్టాల ప్రకారం 7 సం.ల కంటే ఎక్కువ శిక్ష పడే కేసులలో నేరం జరిగిన వెంటనే ఎఫ్.ఎస్.ఎల్., క్లూస్ టీం లోను నేర స్థలం కు చేరుకొనే విధంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. నేరస్థలం సాక్ష్యాలు మార్పు చేయకుండా ఉండేందుకు నేరం జరగగానే ఈ-సాక్ష్యలో అప్లోడ్ చేస్తున్నామని, అదే విధంగా కేసుల అభియోగ పత్రాలను ఈ- ప్రాసిక్యూషన్ ద్వారా సంబంధిత ప్రాసిక్యూటర్లకు ఆన్-లైన్ లో పంపి వారి నుండి ఆమోదం తెసుకుంటున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసు అధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు, ప్రాసిక్యూషన్ విభాగం సమన్వయంతో పనిచేస్తే నేరస్థులకు శిక్ష పడే అవకాశాలు మరింత మెరుగుపడతాయని, ప్రజలకు మెరుగైన న్యాయం చేయవచ్చునని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. రాబోయే రోజులలో యువతను ఫోరెన్సిక్ సైన్స్ కోర్సుల పై మక్కువ చూపే విధంగా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సూచించారు.
ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్, ప్రో. కే.వి.రవి కుమార్, రిజిస్ట్రార్ డా.పల్లవి, ఉపకులపతి డా.ప్రశాంత కుమార్, ప్రాసిక్యూటర్లు, విదార్థులు, పోలీస్ అధికారులు, యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలే పునాదులు వేస్తాయి బండారు

అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్ లు, సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే.





**కొత్తపేట, పెన్ సత్తా, జూన్ 27:**చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీల పాత్ర కీలకమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సీడీపీవో గజలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్స్, వంట సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు పునాదుల వంటివని, వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కొత్తపేట నియోజకవర్గం లోని 285 అంగన్వాడీ కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి ఇండక్షన్ స్టవ్‌తో పాటు కుక్కర్, వంట సామాగ్రిని శనివారం అందజేశారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా డివిజనల్ హెడ్ క్వార్టర్ కొత్తపేటలో 78 కేంద్రాలకు గతంలోనే వీటిని అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆలమూరు 76, రావులపాలెం 70, ఆత్రేయపురం మండలం లోని 61 కేంద్రాలకు సామాగ్రిని పంపిణీ చేస్తున్నామన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పరిశుభ్ర మైన, నాణ్య మైన ఆహారం అందించడంలో ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహారం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. చిన్నారుల పట్ల ప్రేమ, బాధ్యతతో వ్యవహరిస్తూ వారికి మెరుగైన సేవలు అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులకు మెరుగైన సేవలు అందేలా అన్ని వసతులను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# పర్యావరణ పరి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.



**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 27:** ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, భూగర్భ జలాలను, పర్యావరణాన్ని కాపాడు కోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరి రక్షణే ధ్యేయంగా హరిత హారం కార్యక్రమంలో భాగంగా శనివారం అనకాపల్లి వై-జంక్షన్ వద్ద సింహాద్రి సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ పరిధిలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) విభాగం ఆధ్వర్యంలో సిఐఎస్ఎఫ్ అధికారులు, జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ లతో కలసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ప్రతి మొక్క - మన భవిష్యత్తు అనే నినాదంతో మొక్కలను నాటారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....పారిశ్రామిక ప్రాంతాలలో కాలుష్య నివారణకు, పర్యావరణాన్ని కాపాడు కోవడానికి పచ్చదనం ఎంతో అవసరమని, పర్యావరణ పరి రక్షణే ధ్యేయంగా, భవిష్యత్తు తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దేశ సంపద, పరిశ్రమల భద్రతతో పాటు ప్రకృతిని కాపాడుకోవడం కూడా ఒక సామాజిక బాధ్యత అన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో మొక్కల పాత్ర ఎంతో కీలకమని, పర్యావరణాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటాలని, భావితరాలకు స్వచ్ఛ మైన గాలిని, పచ్చని పరిసరాలను అందించడం మన అందరి కర్తవ్యమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటి పర్యావరణాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, మున్సిపల్ జోనల్ కమిషనర్, జిల్లా అధికారులు, సిఐఎస్ఎఫ్ అధికారులు, జవాన్లు మరియు ఎన్టిపిసి ప్రతినిధులు, సిబ్బంది అందరూ కలిసి స్వయంగా గుంతలు తవ్వి, వివిధ రకాల మేలుజాతి మొక్కలను నాటారు.

# ఉచిత కంటి వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలి.

-- అర్బన్ సీఐ రమేష్.



**చిలకలూరిపేట, పెన్ సత్తా, జూన్ 27:** మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, శంకర్ కంటి వైద్యశాల సహకారంతో ప్రత్తిపాటి శరత్ ఆధ్వర్యంలో ఈ నెల 30 వ తేదీన చిలకలూరిపేట లోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో 44 వ మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అర్బన్ సీఐ రమేష్ తెలిపారు. ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మే 29 న ప్రత్తిపాటి శరత్ ఆధ్వర్యంలో ప్రముఖ శంకర్ కంటి వైద్యశాల సహకారంతో నిర్వహించిన 43 వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిన విషయం తెలిసిందే. అయితే వివిధ కారణాల వల్ల ఆ శిబిరానికి హాజరు కాలేకపోయిన వారికి మరో అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో జూన్ 30న ప్రత్యేకంగా 44వ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రమేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే 29 న అవకాశాన్ని వినియోగించుకోలేకపోయిన వారంతా తప్పనిసరిగా ఈ శిబిరానికి హాజరై ఉచిత కంటి వైద్య సేవలను పొందాలని కోరారు. శిబిరంలో కంటి పొరల సమస్యలు, క్యాటరాక్ట్ (శుక్రాలు), రెటీనా సంబంధిత వ్యాధులు, రెటీనా డిటాచ్మెంట్ తదితర కంటి సమస్యలకు సంబంధించిన అత్యాధునిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాధారణంగా వేల నుంచి లక్షల రూపాయల వరకు ఖర్చయ్యే ఈ వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారని , ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే మే 29 న జరిగిన శిబిరంలో పరీక్షలు చేయించుకుని శస్త్రచికిత్సలు పొందిన వారు కూడా ఈ నెల 30 న నిర్వహించే శిబిరానికి హాజరై ఫాలోఅప్ పరీక్షలు చేయించు కోవాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక కంటి వైద్య సేవలను అందిస్తూ వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న శంకర్ కంటి వైద్యశాల వైద్యులు, సిబ్బంది సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రత్తిపాటి పుల్లారావు ఆశయాలకు అనుగుణంగా ప్రత్తిపాటి ఫౌండేషన్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, అందులో భాగంగానే ఈ మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మరోసారి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని అర్బన్ సీఐ రమేష్ పిలుపునిచ్చారు.

# నర్సింగ్ విద్యార్థినులకు సర్టిఫికెట్లు, ఉద్యోగ నియామక పత్రాల ప్రదానం.




**చిలకలూరిపేట, పెన్ సత్తా, జూన్ 27:** స్థానిక అసిస్ట్' స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శనివారం ఒక ప్రత్యేక కార్యక్రమం ఘనంగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన డీఎస్‌వీ (డివిఎస్) సంస్థ సహకారంతో అసిస్ట్ సంస్థలో 'జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్)' వృత్తి విద్యా కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న 60 మంది విద్యార్థినులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రకాశం జిల్లా మాజీ కలెక్టర్ దాసరి శ్రీనివాసులుతమ చేతుల మీదుగా విద్యార్థినులకు కోర్సు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఅసిస్ట్ సంస్థ చేపడుతున్న వివిధ రకాల అభివృద్ధి, సేవా కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందించారు. కోర్సు పూర్తి చేసిన 60 మంది విద్యార్థినులు వివిధ ఆసుపత్రులలో వెంటనే విధుల్లో చేరేందుకు వీలుగా, వారికి ఇదే వేదికపై ఉద్యోగ నియామక పత్రాలను కూడా అందజేయడం విశేషం. ఈ కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ అధినేత డాక్టర్ జె. రంగారావు, అసోసియేట్ డైరెక్టర్లు జె. కృష్ణ హరీష్, ఎం. విష్ణుప్రియ, ఎం.ఎస్.ఆర్.సి. మూర్తి, జి. సూర్యనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ టి. రామారావు, అసిస్ట్, మేలుకొలుపు సంస్థల సిబ్బంది, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి రహదారి సమస్యను పరిష్కరించిన యార్లగడ్డ




**హనుమాన్ జంక్షన్, పెన్ సత్తా, జూన్ 27:** ఇంటికి వెళ్లే రహదారికి ఇరువైపులా చెట్లు అల్లుకుపోవడంతో దారిలేక ఇబ్బంది పడుతున్న వృద్ధురాలు సమస్యకు రెండు గంటల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పరిష్కారం చూపించారు. బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేట గ్రామంలో ఓ వృద్ధురాలు ఇంటికి వెళ్లే దారికి ఇరువైపులా ఉన్న ఇళ్లలో కంపచెట్లు రోడపైకి వాలి రహదారి మూసుకు పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంగతిని స్థానికులు శనివారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తక్షణమే సమస్య పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ ను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కార్యదర్శి రమేష్ కంపచెట్ల తొలగించాలని ఇంటి యజమానులకు చెప్పటంతో వారు చెట్లను తొలగించి సమస్యను రెండు గంటలవ్యవధి లో పరిష్కరించారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పట్ల ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వెంటనే స్పందించి వాటికి పరిష్కారాన్ని చూపిస్తున్నారని ఈ సంఘటన మరోసారి రుజువు చేసింది.

# వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న పీఎం స్వనిధి పథకం.

**జీవీఎంసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (యూసీడీ) బి.వి. రమణ**




**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 27:** కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు, మెప్మా ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పట్టణ జీవనోపాధి మిషన్ 2.0 కార్యక్రమంలో భాగంగా జూన్ 1 వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పీఎం స్వనిధి మహోత్సవం, లోక్ కళ్యాణ్ మేళా కార్యక్రమాల్లో భాగంగా విశాఖపట్నం మహానగర పాలక సంస్థ అనకాపల్లి జోనల్ కార్యాలయం లో శనివారం పీఎం స్వనిధి మహోత్సవ కార్యక్రమం అనకాపల్లి ఇంచార్జ్ జోనల్ కమీషనర్ లక్ష్మి తులసి నిర్వహించడం జరిగిందని జీవీఎంసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) బి వి రమణ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి రుణాలను పంపిణీ చేయడంతో పాటు, వారి వ్యాపారాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసి, వ్యాపారంలో విజయాలు సాధించిన వారి విజయగాథలను వివరించడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు వీధి వ్యాపారులను సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి జోన్ ఇన్చార్జ్ జోనల్ కమిషనర్ లక్ష్మీ తులసి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్, టిఈ - ఎల్హెచ్ (మెప్మా) ప్రతినిధులు, జీవీఎంసీ ప్రధాన కార్యాలయ యు సి డి విభాగం అధికారులు, అనకాపల్లి సహాయ ప్రాజెక్ట్ డైరెక్టర్ సంతోష్ తదితరులు హాజరై వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం ద్వారా కలిగే ప్రయోజనాల పై అవగాహన కల్పించారని ఆయన తెలిపారు. పీఎం స్వనిధి పథకం ద్వారా మొదటి విడతలో రూ.15,000, రెండవ విడతలో రూ.25,000, మూడవ విడతలో రూ.50,000 వరకు తక్కువ వడ్డీతో రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడవ విడత రుణంతో పాటు రూ.30,000 విలువైన క్రెడిట్ సౌకర్యాన్ని ఎలాంటి సేవా రుసుములు లేకుండా వ్యాపార పెట్టుబడుల కోసం వినియోగించుకోవచ్చని వివరించారు. అలాగే రుణాలు పొందిన లబ్ధిదారులు డిజిటల్ లావాదేవీల ద్వారా చెల్లింపులు జరిపితే ప్రతి త్రైమాసికానికి ప్రోత్సాహక నగదు ప్రయోజనం 100 రూపాయలు మనీ బ్యాక్ వస్తుందని తెలిపారు. సామాజిక ఆర్థిక సర్వే ద్వారా అర్హత పొందిన వారికి కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధాన మంత్రి జనధన్ యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ఒకే దేశం ఒకే రేషన్ కార్డు, శ్రమయోగి యోజన, జనని సురక్ష యోజన, మాతృ వందన యోజన వంటి పథకాల ద్వారా ప్రయోజనం పొందవచ్చునన్నారు.






ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సీవోఎస్, టీఎల్ఎఫ్ఎ, స్ఎల్ఎఫ్ ప్రతినిధులు, రిసోర్స్ పర్సన్లు, జోనల్ కమిటీ సభ్యులు, వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ విదేశీ కళాకారులకు కళాజీవ పురస్కారాలు.









- అంతర్జాతీయ కళాకారులతో సాంస్కృతిక పసందు.
- 60 మందికి మీడియా అవార్డులు.
- 150 మంది జర్నలిస్టుల పిల్లలకు ఉపకారవేతనాలు.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 27:**
స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్, వైజాగ్ మీడియా అవార్డుల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28 వ తేదీన ఆదివారం జాతీయ, అంతర్జాతీయ కళాకారులు, మీడియా సోదరులను ప్రోత్సహిస్తూ "ప్రతిభకు ప్రోత్సాహం 2026 "పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యక్రమం నిర్వాహక కమిటీ చైర్మన్ లు గంట్ల శ్రీనుబాబు, ఆర్. నాగరాజు పట్నాయక్ లు తెలిపారు.. ఈ మేరకు శనివారం వీరు మాట్లాడుతూ సిరిపురం – వి. ఎం. ఆర్. డి. ఏ. చిల్డ్రన్స్ ఎరీనా లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్ ..గుజరాత్, బెంగాల్, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన అంతర్జాతీయ కళాకారుల ప్రదర్శనలతో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపుతున్న 60 మంది మీడియా ప్రతినిధులకు, 35 మంది కళాకారులకు కళాజీవ అవార్డులు ప్రధానం చేయడంతో పాటు150 మంది జర్నలిస్టుల పిల్లలకు మెరిట్ స్కాలర్ షిప్స్ అందించ నున్నామన్నారు. విశ్వవ్యాప్తంగా ప్రదర్శనలు ఇస్తున్న శ్రేయశ, రాకేష్ ప్రజాపతి (ఆనంద్, గుజరాత్) వేరోనికా కమాని దశనాయక (శ్రీలంక)అలీఫ్ స్క్వాడ్ టీం (బంగ్లాదేశ్) సరిగమప లిటిల్ ఛాంప్స్ ఫైనలిస్ట్ మహాన్స్ సాయి రెడ్డి( హైదరాబాద్ )లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ హోల్డర్ జానకి రెడ్డి (విశాఖ) ఆర్. హెచ్.టీనా,జి డింపుల్,బి. పూజిత(విశాఖపట్నం )ల బృందం కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు..ప్రముఖ సామాజిక కార్యకర్త, అంతర్జాతీయ వాకర్స్ క్లబ్ సారధి అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు దేశ,విదేశాల్లో అందుకున్న డాక్టర్ కమల్ బెయిడ్ కు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు 2026 ను ప్రధానం చేయనున్నామని తెలిపారు. అదే విధంగా సాంకేతిక సౌకర్యాలు లేని సమయంలో కూడా "నగరదర్శిని" పేరిట సుమారురెండున్నర దశాబ్దాల క్రితం విశాఖ వాసులకు చక్కని క్వాలిటీతో వార్తా విశేషాలను అందించిన సిటీ కేబుల్ న్యూస్ ప్రజెంటర్ సినీ ఎడ్యుకటీవ్ ప్రొడ్యూసర్ కుర్రా విజయ్ కుమార్ కు ఎలక్ట్రానిక్ మీడియా లెజెండ్ పురస్కారాన్ని అందించ నున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నగర్ పోలీస్ కమిషనర్ శంక బ్రత బాగ్చి ను వీరంతా కలిసి ఆహ్వానించారు. సమావేశంలో ప్రజాపిత బ్రహ్మకుమారి బి కే రామేశ్వరి, వేరొనిక కమాని దస్సనాయక (శ్రీ లంక )శ్రేయషా, రాకేష్ ప్రజాపతి (గుజరాత్ )లు పాల్గున్నారు. ఈ సందర్బంగా ప్రతిభ కు ప్రోత్సాహం పోస్టర్ ను ఆవిష్కరించారు.

# జ్యేష్ఠ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు.







**ధర్మకర్తల మండలి సమావేశంలో 41 అభివృద్ధి అంశాలకు ఆమోదం.**

**సింహాచలం, పెన్ సత్తా, జూన్ 27:**
ప్రసిద్ధ పుణ్యక్షేత్ర మైన వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలంలో జ్యేష్ఠ పౌర్ణమి వేడుకలు భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గోవా రాష్ట్ర గవర్నర్, సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త, ధర్మకర్తల మండలి అధ్యక్షులు పూసపాటి అశోక్ గజపతిరాజు స్వామి ని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో అర్చక స్వాములు గవర్నర్‌కు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం కప్పస్తంభాన్ని ఆలింగనం చేసిన అనంతరం స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతరాలయంలో అర్చకులు ఆయన పేరున అష్టోత్తర శతనామార్చన నిర్వహించగా, గోదాదేవి సన్నిధిలో మంగళహారతి స్వీకరించారు. బేడా మండపంలో వేదపండితుల వేదాశీర్వచనాలు, నాదస్వర విద్వాంసుల మంగళ వాయిద్యాల నడుమ గవర్నర్‌ను సత్కరించారు. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా శ్రీస్వామివారికి సమర్పించే గంధం అరగదీత కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పరిశీలించి, గంధాన్ని స్వయంగా అరగదీసి తన భక్తిని చాటుకున్నారు. అనంతరం దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

తదుపరి కృష్ణాపురం గోశాలలో తన తండ్రి, దివంగత డాక్టర్ పి.వి.జి. రాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం నిర్వహించిన ధర్మకర్తల మండలి సమావేశానికి పూసపాటి అశోక్ గజపతిరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన 43 అంశాలతో కూడిన ఎజెండాను ప్రవేశపెట్టగా, 41 అంశాలకు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. ఒక అంశాన్ని పెండింగ్‌లో ఉంచగా, మరో అంశాన్ని తిరస్కరించింది. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు మాకెన సీతారాం (నవీన్), కాసిరెడ్డి దామోదర్, చలమూరి భారతి, కరక దేవుడు, కనకాల మురళీమోహన్,
వెంపడపు అన్నపూర్ణ, బీతాల నీరజ లక్ష్మీకుమారి, మధుపాడ సన్యాసిరావు,
డాక్టర్ ధరణి బండ్ల, నీట్టుపల్లి మహేష్,
పెద్దిశెట్టి ఉషాశ్రీ, లలిత జ్యోతి, గుట్టికొండ శ్రీలత, సుసరపు గణపతి రావు, చల్లంగి జ్ఞానేశ్వరి, పావులూరి శ్రీనివాస రావు,
ప్రత్యేక ఆహ్వానితులు బొకం స్వామి నాయుడు, వేదుల దక్షిణామూర్తి,
ఎక్స్-అఫీషియో సభ్యుడు
ప్రధాన అర్చకులు గోదావర్తి శ్రీనివాసాచార్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, దేవస్థానం అధికారులు, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

# అనంత అరణ్యం కార్యక్రమంలో మొక్కలు నాటే కార్యక్రమం







**పరవాడ, పెన్ సత్తా, జూన్ 27:**
కూటమి ప్రభుత్వం చేపట్టిన అనంత అరణ్యం కార్యక్రమంలోభాగంగా
తాణాం గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాల ఆవరణములో, నెట్ జీరో హెల్త్ క్యాంపస్ ప్లాంటేషన్ ప్రోగ్రాంలో మొక్కలు నాటడం జరిగినది. శనివారం ఈ కార్యక్రమంలో మొక్కలు నాటడం వలన పర్యావరణాన్ని కాపాడడంతో పాటు కళాశాలలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడానికి ఉపయోగపడుతుందని, అలాగే పొల్యూషన్ కూడా తగ్గించవచ్చని దానివలన ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని ముఖ్య అతిథిగా పాల్గొన్న మండలం మాజీ జెడ్పిటిసి సభ్యులు పయిల్ జగన్నాధ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కన్నూరు దేవి, ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి సునీత, స్కూల్ కమిటీ చైర్మన్ రొంగలి నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ రమా మోహిని, జిల్లా టిఎన్టియుసి అధ్యక్షులు రొంగలి గోపాలకృష్ణ, పరవాడ మండలం డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జునరావు, సుభాష్, ఎన్ ఆర్ జి ఎస్ అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# కోడిపందాల స్థావరం పై పోలీసుల దాడి.



**తొమ్మిది మంది అరెస్ట్, రూ.28,070 నగదు స్వాధీనం.**

**రాంబిల్లి, పెన్ సత్తా, జూన్ 27**: అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ బి.మోహన రావు ఆదేశాల మేరకు, రాంబిల్లి ఇన్స్పెక్టర్ నరసింగరావు ఆధ్వర్యంలో ఎస్సై దినకర్, సిబ్బంది శనివారం తెల్లవారుజామున
దారభోగాపురం లే అవుట్ పరిధిలో జరుగుతున్న కోడిపందాల స్థావరం పై ఆకస్మిక దాడి నిర్వహించారు.
ఈ దాడిలో కోడిపందాలు ఆడుతున్న తొమ్మిది మంది (9) నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.28,070/- ల నగదు, 9 మొబైల్ ఫోన్లు, 3 మోటార్ బైకులు, 7 పందెం కోళ్లను (3 సజీవంగా ఉన్నవి, 4 మృతి చెందినవి) స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుల పై రాంబిల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై దినకర్ ఒక ప్రకటనలో తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# ఆటో ప్రయాణికులనే లక్ష్యంగా చేసుకున్న కిలాడీ లేడీ దొంగ అరెస్ట్

**తనాలకు పాల్పడుతున్న మహిళా నిందితురాలి అరెస్ట్ -- రెండున్నర తులాల బంగారు సూత్రాలతో కూడిన పుస్తెలత్రాడు, రూ.14,000 నగదు రికవరీ**

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 27:** అనకాపల్లి పట్టణంలో ఆటోల్లో ప్రయాణించే మహిళలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఒక అంతర్జిల్లా మహిళా దొంగను అనకాపల్లి టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితురాలి నుండి దొంగిలించిన బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను అనకాపల్లి టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు వెల్లడించారు.
అనుమానాస్పదంగా తిరుగుతూ దొరికిన నిందితురాలు.
అనకాపల్లి పట్టణం, శంకరం రైల్వే బ్రిడ్జి సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో సబ్బవరం నుండి అనకాపల్లికి ఆటోలో వస్తున్న ఓ మహిళ పోలీసులను చూసి కంగారుపడి, ఆటో దిగి నడుచుకుంటూ వెళ్లేందుకు ప్రయత్నించింది. అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను అదుపు లోకి తీసుకుని విచారించగా, పలు దొంగతనాల ఉదంతాలు వెలుగు లోకి వచ్చాయి. నిందితురాలి వివరాలు గంట మీనా, భర్త: ఏలేసు, వయస్సు: 32 సంవత్సరాలు, నివాసం: 202 కాలనీ, కొత్తవలస గ్రామం, విజయనగరం జిల్లా.
నిందితురాలు అంగీకరించిన నేరాలు.
?పోలీసుల విచారణలో నిందితురాలు అనకాపల్లి పట్టణంలో జరిగిన రెండు ప్రధాన దొంగతనాలలో తన ప్రమేయం ఉన్నట్లు అంగీకరించింది. భీమునిగుమ్మం ప్రాంతంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళల్లో ఒకరి సంచిని బ్లేడ్‌తో కోసి, అందులో ఉన్న రూ.20,000/- నగదును దొంగిలించింది. రైల్వే స్టేషన్ అండర్ బ్రిడ్జి వద్ద ఆటో ఎక్కిన వృద్ధురాలిని అనుసరిస్తూ, గాంధీనగర్ మోర్ షాపు సమీపంలో ఆమె మెడలో ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు సూత్రాల తాడును అపహరించింది. నిందితురాలి నుంచి పోలీసులు సుమారు రెండున్నర తులాల బంగారు సూత్రాలతో కూడిన పుస్తెల తాడు, రూ.14,000/- నగదు సొత్తును పోలీసులు రికవరీ చేశారు.
?అనకాపల్లి టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణలో, ఈ అరెస్టు, సొత్తు రికవరీని సమర్ధవంతంగా పూర్తి చేసిన టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ అల్లు వెంకటేశ్వర రావు, పోలీస్ సిబ్బంది సంతోష్ కుమార్, మహిళా పోలీస్ సిబ్బంది ఉమ, గిరిజలను ఉన్నతాధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రజల అప్రమత్తతే నేరాల నివారణకు ఉత్తమ రక్షణ అని ప్రజలకు టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ముఖ్య విజ్ఞప్తి చేశారు. ?పట్టణంలో బస్సులు, ఆటోలలో ప్రయాణించే ప్రయాణికులు (ముఖ్యంగా మహిళలు) తమ బంగారు ఆభరణాలు, నగదు, విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్, నాలుగు రోడ్ల జంక్షన్,
?చోడవరం బస్ స్టాప్, పెరుగు బజార్ జంక్షన్, ?బాలకృష్ణ




బస్ స్టాప్, ?రైల్వే స్టేషన్ పరిసర రద్దీ ప్రాంతాల్లో మరింత జాగ్రత్తగా ఉండండాలి అని సూచన చేశారు.
?బస్సులు లేదా ఆటోలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు మీ హ్యాండ్ బ్యాగులు, నగదు, సెల్‌ఫోన్లను ఒకటికి రెండుసార్లు సరిచూసుకోండి. మీ చుట్టుపక్కల అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల పట్ల నిఘా ఉంచండి. ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తించినా లేదా దొంగతనం జరిగినట్లు గమనించినా వెంటనే సమీపంలోని పోలీస్ సిబ్బందికి గానీ, లేదా అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాల్సిందిగా కోరడమైనది.

# పార్టీ కోసం శ్రమించే ప్రతీ కార్యకర్తకు జనసేనలో గుర్తింపు




**తుమ్మల శ్యామ్ కిషోర్‌కు జనసేనలో కీలక బాధ్యతలు**

**నక్కపల్లి, పెన్ సత్తా, జూన్ 27:**
పార్టీ అభివృద్ధికి నిరంతరం శ్రమించే ప్రతి కార్యకర్తకు జనసేన పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని జనసేన పార్టీ మండల అధ్యక్షులు వెలగా సుధాకర్ అన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ సిద్ధాంతాలను విశ్వసిస్తూ, అంకితభావంతో పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తున్న ఉద్దండపురం గ్రామానికి చెందిన యువ జనసైనికుడు, నక్కపల్లి మండల జనసేన ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్యామ్ కిషోర్కి అరుదైన గౌరవం దక్కింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ శ్యామ్ కిషోర్ సేవలను గుర్తిస్తూ, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యుడిగా నియమించడం పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇది కేవలం శ్యామ్ కిషోర్కి వచ్చిన పదవి మాత్రమే కాదని పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి జనసైనికుడికి దక్కిన గౌరవం అన్నారు. శనివారం ఉద్దండపురం గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు అమలకంటి హరికృష్ణ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నక్కపల్లి మండల సహాయ కార్యదర్శి సఖిరెడ్డి గణపతి ముఖ్య అతిథులుగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు.
అలాగే గ్రామ మాజీ సర్పంచ్ పేకేటి రాజారావు, మాజీ ఉప సర్పంచులు పొడగట్ల సన్యాసిరావు, బొల్లం రమణ, జనసేన నాయకులు మేకల సాయి, పేకేటి లచ్చబాబు, పొడగట్ల రాజు, గొల్లపల్లి రాజు, బూత్ ఏజెంట్లు నాగసాయి, శివ, దుర్గాప్రసాద్, జనసైనికులు శివయ్య, దివాణం, వెంకటేష్, అప్పలరాజు, రామదాసు, శ్రీను, సత్తిబాబు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రెవిన్యూ సేవలు సామాన్యుడికి చేరువ చేయాలి.

- వీఆర్వో, సర్వేయర్, తాసిల్దార్ తదితర అధికారుల్లో జవాబుదారీతనం పెరగాలి.
- డివిజన్లో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి.
- చెరువులు, గెడ్డలు, ప్రభుత్వ స్థలాలను కబ్జాదారుల నుండి కాపాడాలి.
- ఆర్డీవో దృష్టికి రెవెన్యూ సమస్యలు తీసుకువెళ్లిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.



**పార్వతీపురం, పెన్ సత్తా, జూన్ 27:**
రెవెన్యూ సేవలు సామాన్యుడికి చేరువు చేయాలని భారత కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. శనివారం కాంగ్రెస్ పార్టీ డిసిసి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, ఓ బి సి చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ బంకురు ప్రకాష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు గొట్టాపు రేణుక తదితరులు పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన పార్వతీపురం ఆర్డీవో కే. మాధురి ని పుష్పగుచ్చాన్ని అందజేసి మర్యాద పూర్వకంగా స్వాగతించారు. ఈ సందర్భంగా డివిజన్ ని వేధిస్తున్న రెవెన్యూ సమస్యల పై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్లో రెవెన్యూ సేవలు సామాన్యుడికి అందుబాటు లోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. వీఆర్వో, సర్వేయర్, తాసిల్దార్ తదితర రెవెన్యూ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చూడాలన్నారు. పార్వతీపురానికి సంబంధించిన రికార్డులు పలు తారు మారైనట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. గతంలో పనిచేసిన తాసిల్దార్లు రికార్డుల్లో మార్పులకు దోహదపడ్డారనే ఆరోపణలు బలంగా ఉన్నాయన్నారు. పార్వతీపురంలో నెల్లిచెరువు, కోదువాని బంధ, లంకెల చెరువు, లక్ష్మనాయుడు చెరువు, బిళ్ళ బంధ, దేవుడి బంద, కామయ్య బంధ, గోప సాగరం, పాత్రుడి గారి కోనేరు ఇలా చెరువులన్నీ కబ్జాలకు గురయ్యాయన్నారు. వరహాల గెడ్డ సైతం ఆక్రమణకు గురైందన్నారు. వీటితోపాటు పలు ప్రభుత్వ స్థలాలు కూడా కబ్జాకు గురయ్యాయన్నారు. వాటిని గుర్తించి, సర్వే చేయించి, హద్దులు నిర్ణయించి, ఆక్రమణలు తొలగించి కబ్జాదారుల పై చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వేలో దొర్లిన తప్పులను సరిదిద్దాలన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రికార్డులు తారుమారు చేసి ఒకరి భూములు ఇంకొకరివిగా సృష్టిస్తూ రెవెన్యూ అధికారులు కొంతమంది ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఫేక్ పట్టాలు, అక్రమ రిజిస్ట్రేషన్లు సర్వసాధారణమన్నారు. సమస్యలు పరిష్కారము కాక కొంతమంది ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు, రెవెన్యూ క్లినిక్ కు వచ్చిన అర్జీదారులే మళ్లీ మళ్లీ వచ్చే పరిస్థితి నెలకొందన్నారు. కాబట్టి డివిజన్ ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని అందజేశారు.

# రాష్ట్రపతి విశాఖ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి.

**పోలీసు కమిషనర్ తో కలిసి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్.**





**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 27:** ఈ నెల 30 న భారత రాష్ట్రపతి విశాఖపట్టణంలో పర్యటిస్తున్న నేపథ్యంలో భద్రతా, ప్రోటోకాల్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ శనివారం సంయుక్తంగా పరిశీలించారు. రాష్ట్రపతి రానున్న ఐఎన్ఎస్ డేగాతో పాటు పర్యటనలో భాగంగా సందర్శించనున్న ప్రాంతాలు, ప్రయాణ మార్గాలు, నోవాటెల్ లోని సభా వేదికల వద్ద అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, అత్యవసర స్పందన బృందాల సిద్ధత పై సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోపాలకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సందర్శించే ప్రతి ప్రదేశంలో ప్రోటోకాల్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. రాష్ట్రపతి భద్రతకు సంబంధించి అన్ని స్థాయిల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని, ట్రాఫిక్ మళ్లింపులు, భద్రతా సిబ్బంది మోహరింపు, తనిఖీలు, కమ్యూనికేషన్ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ చెప్పారు. ఈ పరిశీలనలో డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, అదనపు ఎస్పీలు, జీవీఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైసిపి సీనియర్ నేత గొర్ల బాబురావుకు ఘన నివాళి - రాజ్యసభ ఎంపీ గొల్ల



**నక్కపల్లి, పెన్ సత్తా, జూన్ 27:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, బుచ్చిరాజుపేట మాజీ సర్పంచ్ దివంగత గొర్ల బాబురావుకు రాజ్యసభ ఎంపీ గొల్ల బాబురావు ఘన నివాళు లర్పించారు. శనివారం బుచ్చిరాజుపేటలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన పాల్గొని గొర్ల బాబురావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారికి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు మాట్లాడుతూ పార్టీలో సీనియర్ నేత అకాల మరణం బాధాకరం అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో వై ఎస్ ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి పరిశీలకులు చిక్కాల రామారావు, గొల్ల సాయి కార్తీక్, శ్రీపతి రాజు,రాష్ట్ర ఎస్ ఈ సి సభ్యుల రాజసాగి దత్తుడు రాజు,జిల్లా ప్రధాన కార్యదర్శి,శీరం నరసింహ మూర్తి,పాయకరావుపేట ఎంపీపీ ఇసరపు పార్వతి,తాతారావు వైసీపీ మండల అధ్యక్షులు గెడ్డమూరి శ్రీనివాసరావు, జిల్లా ప్రచార వింగ్ అధ్యక్షులు దగ్గుపల్లి సాయి బాబా, లోడగల చంద్రరావు, జగతా శ్రీనువాస్ ,యలమంచిలి తాతబాబు జనపరెడ్డి శేషరత్నం తదితరులు ఉన్నారు.

## అమెరికా పర్యటన ముగించుకుని స్వదేశానికి చేరుకున్న యార్లగడ్డ.






**విమానాశ్రయంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన కూటమి నాయకులు.**

**పోలవరం కుడి కాలువ--ఏలూరు కాలువ అనుసంధానానికి రూ.38 కోట్లు మంజూరు అయ్యాయి యార్లగడ్డ.**

**సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు.**

**గన్నవరం అభివృద్ధే నా ఏకైక అజెండా రాజకీయాలు కాదు యార్లగడ్డ.**

**సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే మూడు అమలు చేశాం యార్లగడ్డ.**

**చెప్పిందే చేస్తా.. చేసిందే చెబుతా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.**

**ఘన స్వాగతం పలికిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు.**

**గన్నవరం, పెన్ సత్తా, జూన్ 27:** నియోజకవర్గ అభివృద్ధికి తాను చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని, రాజకీయ కక్ష సాధింపులు తమ లక్ష్యం కాదని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని ఆయన శనివారం రాత్రి స్వదేశానికి చేరుకున్నారు. ఈ నెల 6 వ తేదీన వ్యక్తిగత పనుల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి అమెరికాకు వెళ్లిన ఆయన, పర్యటన అనంతరం గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే రాక సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో విమానాశ్రయానికి చేరుకుని ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ర్యాలీ గా తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తన పై నమోదు చేసిన తప్పుడు కేసుల కారణంగా దాదాపు 20 నెలల పాటు కోర్టుల చుట్టూ తిరిగి కోర్టు అనుమతి లభించిన తర్వాతే అమెరికా వెళ్లానని తెలిపారు. అమెరికాలో ఉన్న సమయంలో కూడా గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి కోసమే నిరంతరం కృషి చేశానని అన్నారు. పోలవరం కుడి కాలువ--ఏలూరు కాలువ అనుసంధానానికి రూ.38 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుతో రైతులకు శాశ్వత సాగునీటి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు గన్నవరం ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి దాదాపు 750 రోజుల్లో కేవలం 30 రోజులే నియోజకవర్గానికి దూరంగా ఉన్నానని, మిగతా సమయం మొత్తం ప్రజల మధ్యే ఉండి అభివృద్ధి కోసం పనిచేశానని చెప్పారు. రాజకీయాల కోసం రాజకీయాలు చేయడం తన లక్ష్యం కాదని, గన్నవరం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే మూడు అమలు చేశామని, మిగిలిన హామీలను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. మల్లవల్లి పారిశ్రామిక వాడకు ఊతమిచ్చి వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అశోక్ లేలాండ్ ప్రాజెక్ట్ పునరుద్ధరణతో పాటు మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చే దిశగా కృషి కొనసాగుతోందన్నారు. గన్నవరం నియోజకవర్గంలో 12 సంవత్సరాల తర్వాత రైతులకు ఉచితంగా మట్టి అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని, గ్రామాల్లో రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. గన్నవరం ప్రజలు తన పై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని, అభివృద్ధే తమ లక్ష్యం అని అన్నారు. విమానాశ్రయానికి వచ్చి ఘన స్వాగతం పలికిన తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు విజేత “బొరివంక.”





**అభినందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు.**

**పెన్ సత్తా, జూన్ 27:**సోంపేట మండలం ఏకువూరు గ్రామంలో “సహాయ యువత ఫౌండేషన్” రెండవ వార్షికోత్సవ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉత్తరాంధ్ర స్థాయి “క్విజ్” పోటీలు ఘనంగా నిర్వహించారు.ఈ క్విజ్ పోటీల్లో 36 జట్లు పాల్గొనగా ప్రథమ స్థానం కవిటి మండలం “బొరివంక” జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 10116 నగదు, షీల్డు కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానం “హరిపురం” పాఠశాల విద్యార్థులు 7116 నగదు షీల్డు,తృతీయ స్థానం “విజయనగరం”కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు 5016 నగదు షీల్డు కైవసం చేసికొన్నారు.ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డి.రామ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యత వెలికి తీసేందుకే ఈ క్విజ్ పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో డిఆర్డివో శాస్త్రవేత్త గంట.వెంకట్రావు, బారువా ఎస్సై హరిబాబు చేతుల మీదుగా బహుమతి ప్రధానం జరిగింది.శనివారం బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ 2 సనపల.రామకృష్ణ విద్యార్థులను అభినందించి, మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థానంలో ఉండాలని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రాంబిల్లిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది అరెస్ట్.



**పెన్ సత్తా, జూన్ 27:**శనివారం తెల్లవారు జామున కోడి పందాల స్థావరం పై పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశారు.
రాంబిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింగరావు ఆధ్వర్యంలో ఎస్సై దినకర్ వారి సిబ్బంది ముందస్తు సమాచారంతో
దార భోగాపురం లేఅవుట్ లో జరుగుతున్న కోడి పందా ల పై ఆకస్మిక దాడి నిర్వహించారు.కోడి పందాలు ఆడు తున్న తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 28 వేల70 రూపాయలు నగదు 9 మొబైల్ ఫోన్లు 3 మోటార్ బైకులు 7 పందెం కోళ్లను (4 మృతి చెందినవి) స్వాధీనం చేసుకున్నారు.నిందితుల ను రిమాండ్ కు తరలించి కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై దినకర్ తెలిపారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ పి తుహిన్ సిన్హా పరవాడ డిఎస్పీ మోహన్ రావు హెచ్చరించారు.

## పరారీలో ఉన్న గంజాయి నిందితుడు అరెస్ట్.



**పెన్ సత్తా, జూన్ 27:**గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడు కొర్ర మురళి ( 31)ని నాతవరం పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు.చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీ జోహర్ గ్రామానికి చెందిన మురళి పై గత ఏడాది నాతవరం పోలీస్ స్టేషనులో గంజాయి కేసు నమోదు అయ్యింది.మురళి పోలీస్ ల నుండి తప్పించుకొని పరారీలో ఉన్నాడు.ఇప్పుడు అదుపులోకి తీసుకొని నర్సీపట్నం కోర్టులో హాజరుపరచగా నిందితుడుకి రిమాండ్ విధించారని ఎస్ ఐ తారకేశ్వరరావు తెలిపారు.

## నాతవరం మండలంలో ఘనంగా అనంత అరణ్య మహోత్సవం.



**పెన్ సత్తా, జూన్ 27:**నాతవరం మండలం తాండవ ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్ హైస్కూల్ రామన్నపాలెం ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ హైస్కూల్ మర్రిపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవి)పాఠశాలల్లో
శనివారం అనంత అరణ్య మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి విస్తృతంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి తాండవ ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యనారాయణ, ఎంపీడీవో ఎంఎస్.శ్రీనివాస్, ఏపీఓ కొండాజీ తదితరులు హాజరై పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా తాండవ ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనంత అరణ్య పేరుతో వినూత్న కార్యక్రమాన్ని అమలు చేయడం అభినందనీయమన్నారు.
ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, టీడీపీ నాతవరం మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, ఎస్సీ కార్పొరేషన్ నాయకుడు కొండ్రు మరిడయ్య, ఎంపీపీ సాగిన లక్ష్మణ మూర్తి పీకే గూడెం పీఏసీఎస్ అధ్యక్షులు అంకంరెడ్డి నానిబాబు, అప్పన విజయ్, కాసపు బొబ్బిలి, అప్పన సత్యనారాయణ, యువజన అధ్యక్షులు పోలుపర్తి సాయి, మాజీ యువజన అధ్యక్షులు శెట్టి లోవ, వీఆర్పీలు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సంపాదకీయం

# సంక్లిష్ట ద్రవ్యోల్బణం!

భారతదేశంలో మే నెలలో చిల్లర ద్రవ్యోల్బణం 3.93 శాతానికి చేరుకుంది. ప్రస్తుత వినియోగదారు ధర సూచిక శ్రేణిలో ఇది గరిష్ఠ స్థాయి; పాత శ్రేణితో పోల్చినా, ఇది సుమారు పదిహేను నెలల ఉచ్ఛస్థాయి. ఆహార ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 4.20 శాతంగా ఉండగా, మేలో అది 4.78 శాతానికి వేగంగా పెరిగింది. రవాణా రంగంలో ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో స్వల్పంగా తగ్గినప్పటికీ, మేలో 1.75 శాతానికి పుంజుకుంది; అందులోని సరుకు రవాణా సేవల విభాగం 7.63 శాతం పెరుగుదలను నమోదు చేసింది. ఇది ఆందోళనకరమైన సంకేతం. మే మధ్యభాగం నుండి నాలుగు దశలుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంవల్ల ఈ పెరుగుదల సంభవించింది. అంతటితో ఆగకుండా, వాణిజ్య ఎల్పీజీ ధర 19 కిలోల సిలిండర్‌కు సుమారు రూ.1,300 పెరిగింది. ఫిబ్రవరి నుంచి చూస్తే ఇది 75 శాతానికి పైగా పెరుగుదల. ఈ భారం హోటళ్ళు, రెస్టారెంట్లు, వసతి సేవలరంగంలో స్పష్టంగా ప్రతిఫలించింది. ఆ విభాగంలో ద్రవ్యోల్బణం 5.75 శాతానికి చేరింది. వ్యక్తిగత సంరక్షణ మరియు ఇతర వస్తుసేవల విభాగంలో ద్రవ్యోల్బణం 18.46 శాతమనే అసాధారణ స్థాయికి పెరిగింది. బంగారం, వెండివంటి విలువైన లోహాల ధరలు ఆకాశాన్నంటడం ఇందుకు ప్రధాన కారణం. గృహ ఎల్పీజీ ధర ఈనెల ప్రారంభంలో మళ్లీ రూ.29 పెంచారు. ఈ సర్దుబాటు జూన్ వినియోగదారు ఆహార ధరల సూచికలో పూర్తిగా కనిపిస్తుంది. హోల్‌సేల్ ధర సూచిక సంఖ్యలు మరియు దేశపు తొలి ఉత్పత్తిదారు ధర సూచిక సమీప భవిష్యత్తులో వెలువడనున్నాయి. ఉత్పత్తిదారులు, సగటు వ్యాపారులు ఈ ధరల భారాన్ని ఎంతమేరకు గ్రాహకుడిపైకి నెట్టారో, ఇంకా ఎంతమేరకు తాము మోస్తున్నారో అవి వెల్లడిస్తాయి. ఈ నేపథ్యంలో, ద్రవ్యోల్బణం ఇంకా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) నిర్దేశించిన 4 శాతం లక్ష్యానికి తక్కువగానే ఉన్నప్పటికీ (2-6 శాతం సహన పరిధిలో), ఆర్బీఐ తన సాంప్రదాయ అనుకూల వైఖరిని విడువలేదు. ముందుముందు ధరల ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్న అప్రమత్తత అందుకు కారణం.

ద్రవ్యోల్బణం తీరుతెన్నులను కేవలం దేశీయ కోణం నుండి మాత్రమే చూస్తే పరిస్థితి అర్థం కాదు. అంతర్జాతీయ శక్తి రాజకీయాలను సమాంతరంగా అర్థం చేసుకోవాలి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త సైనిక చర్యలతో ఇరాన్‌కు ఘర్షణ తీవ్రమైనప్పటి నుండి భారత రూపాయి ఆసియాలో అత్యంత తక్కువ పనితీరు చూపిన కరెన్సీగా నిలిచింది. మే నెలలో 97 రూపాయలకు చేరుకున్న డాలర్ మారకపు విలువ ఇప్పుడు 95-96 స్థాయికి దిగివచ్చింది. ఇందుకు ఆర్బీఐ విదేశీ మారక మార్కెట్లో డాలర్లను విక్రయించడం ద్వారా జోక్యం చేసుకోవడం తోడైంది. అయినప్పటికీ, హర్మూజ్ జలసంధి గుండా నిరంతరాయంగా సాగుతున్న చమురు రవాణా భారత్‌కు తాత్కాలిక ఊరటనిచ్చింది. ఇరాన్ ఈ జలమార్గంపై సుంకాలు లేదా ఆంక్షలు విధిస్తుందని జారీ అయిన హెచ్చరికలు ఇంకా పూర్తిగా చెదరిపోలేదు. అలా జరిగితే, భారత్‌వంటి శక్తి దిగుమతిదారు దేశాలు తీవ్రంగా ఇబ్బంది పడతాయి. ముడి చమురు ధరలు తగ్గినా తక్షణం ప్రభావం ఉండదు. చమురు మార్కెటింగ్ కంపెనీలు మే నెల ధర పెంపుల ద్వారా నష్టాలు తొలగించుకున్న తర్వాతే తిరిగి ధరలు తగ్గిస్తాయి. ఎల్పీజీ ధరలు కూడా స్థిరంగా మిగులుతాయని మార్కెట్ సంకేతాలు చెబుతున్నాయి. ఈ మొత్తం సందర్భంలో ఒక్క సానుకూలాంశమేమిటంటే.. ఆహారం మరియు ఇంధనాన్ని మినహాయించిన మూలాంశ ద్రవ్యోల్బణం (కోర్ ఇన్‌ఫ్లేషన్) 3.8-3.9 శాతం వద్ద పరిమితంగా ఉంది. గత కొన్ని నెలలతో పోలిస్తే ఇది దాదాపు మారలేదు. ఇది తయారీ రంగంలో ధరల ఒత్తిడి ఇంకా అదుపులో ఉందని సూచిస్తుంది. అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యకుశలత కొంత ముందడుగు వేయడం మరియు జలసంధి మూత పడకపోవడం చమురు ధరలకు కొంత స్థిరత్వాన్నిచ్చాయి. అయినప్పటికీ, భూరాజకీయ అనిశ్చితి తొలగిపోలేదు. ఈ పరిస్థితి వెంటనే మారవచ్చు, మరో అనుకోని పరిణామం చోటు చేసుకోవచ్చు. అంతర్గతంగా, బంగారం, వెండి ధరల పెరుగుదల, ఎల్పీజీ మరియు ఇంధన ధరల ప్రభావం ఆహారేతర సేవారంగంలో చొచ్చుకుపోవడం.. ఈ రెండు కారకాలు ద్రవ్యోల్బణ తీరును సంక్లిష్టం చేస్తున్నాయి. పట్టణ ప్రాంత గృహస్థులు రెస్టారెంట్ భోజన ఖర్చు, ప్రయాణ ఖర్చు, వ్యక్తిగత సంరక్షణ ఖర్చులు మూడూ ఒకేసారి పెరగడంతో సరాసరి ఖర్చు భారం మరింత పెరుగుతోంది.

ఆర్బీఐ తన సాంప్రదాయ అనుకూల వైఖరిని నిలబెట్టుకోవడం, వడ్డీ రేట్లను తగ్గించే దిశలో ఇప్పుడే అడుగు వేయకపోవడం.. ఈ నిర్ణయం ముందుచూపుతో తీసుకున్నదే. ద్రవ్యోల్బణం ఇప్పటికి 4 శాతం లక్ష్యాన్ని మించకపోయినా, ముందు నెలలలో పెరగవచ్చునన్న ఆందోళన కారణంగా ఉదారీకరణ ఆలోచన వాయిదా పడింది. చమురు ధరలు, ఎల్పీజీ ధరలు, రవాణా ఖర్చులు.. ఈ మూడూ ద్రవ్యోల్బణంపై గ్రేటర్ ట్రాన్స్‌మిషన్ ఎఫెక్ట్ చూపుతున్న తరుణంలో, కేంద్ర ప్రభుత్వం కూడా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన సందర్భమిది. పన్ను సర్దుబాటు ద్వారా ఇంధన ధరల ఒత్తిడిని అదుపు చేయగలిగే అవకాశం ఉన్నప్పటికీ, ఆర్థిక క్రమశిక్షణ కోసం విత్త లోటు పరిమితులు దానిని కష్టతరం చేస్తున్నాయి. కేంద్రానికి ఒక్క ఓదార్పు ఏమిటంటే.. మూలాంశ ద్రవ్యోల్బణం నిలకడగా ఉండడం. ఇది తయారీ మరియు సేవారంగాలలో వేతన-ధర చక్రం ఇంకా ప్రారంభం కాలేదని చెప్పే సంకేతం. అయినప్పటికీ, శాంతి చర్చలు ఫలించినా, హర్మూజ్‌పై ఉద్రిక్తత తగ్గినా, ద్రవ్యోల్బణం వేగంగా తగ్గే అవకాశం నేరుగా లేదు. చమురు మార్కెటింగ్ సంస్థలు ధరలు తగ్గించడానికి తొందరపడవు. ఎల్పీజీ ధరలు అంత సులభంగా వెనక్కి రావు. ఇరాన్ జలసంధి ద్వారా రవాణాపై ఆంక్షలు లేదా సుంకాలు విధించే అవకాశం పూర్తిగా తోసిపుచ్చలేము. కాబట్టి, ఈ పరిస్థితిలో ప్రభుత్వం, ఆర్బీఐ రెండూ 'వేచి చూడు' వైఖరిలోనే ఉండాల్సి వస్తోంది. సంపూర్ణ శాంతి వెలిసినా ధరలపై వెంటనే అనుకూల ప్రభావం కనిపించకపోవచ్చు. ఇదిప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ ముందున్న కఠిన వాస్తవం. గ్రాహకుడికి ఉపశమనం అందించాలంటే, అంతర్జాతీయ పరిస్థితిపై ఆధారపడటం కాదు, దేశీయ సరఫరా వ్యవస్థ బలోపేతం, ఇంధన రంగ సంస్కరణలు, ప్రత్యేకంగా వంట గ్యాస్ ధరల నిర్వహణలో దీర్ఘకాలిక విధాన స్పష్టత అవసరం!



## ఇంకా వణుకుతున్న వెనెజువెలా..!

జంట భూకంపాలతో వణికిన వెనెజువెలాలో మరోసారి భూమి కంపించింది. ఇంకా కంపిస్తూనే ఉంది. మూడోసారి వచ్చిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.9గా నమోదైంది. ఆ దేశ కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం ఈ ప్రకంపనలు వచ్చాయి. రాజధాని నగరం కారకస్, మరాకే సమీపంలో ఈ ప్రభావం కనిపించడంతో ప్రజలు వణికిపోయారు. మరోవైపు, ఇటీవల సంభవించిన భారీ భూకంపాల కారణంగా ఆ దేశానికి రూ.63వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా బుధవారం సాయంత్రం 7.2, 7.5 తీవ్రతతో క్షణాల వ్యవధిలో రెండు భూకంపాలు రావడంతో వేలాదిమంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. వందల భవనాలు కూలిపోవడంతో సహాయకచర్యలు క్లిష్టంగా మారాయి. రెస్క్యూ సిబ్బంది సంఖ్య పరిమితంగా ఉండటంతో.. ఆత్మీయులను కోల్పోయిన వారంతా చేతులతోనే శిథిలాలను తొలగిస్తున్నారు. ప్రాణాలతో రక్షించడానికి తొలి 48నుంచి 72 గంటలు కీలకం కావడంతో ఎలాగైనా తమవారిని కాపాడుకోవాలని వారు చేస్తోన్న ప్రయత్నాలతో భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ఉద్విగ్న వాతావరణం కనిపిస్తోంది. లా గువేరా రాష్ట్రం జంట భూకంపాలతో తీవ్రంగా ప్రభావితమైంది. రెస్క్యూ సిబ్బంది ఈ రాష్ట్రంలో పలు ప్రాంతాలకు చేరుకోవడంలో ఆలస్యమవుతుండటంతో బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎనిమిది అంతస్తుల భవనం కూలడంతో తన ఐదేళ్ల కుమారుడు, మరికొంతమంది బంధువులు చిక్కుకుపోయారని జెన్నిఫర్ అనే మహిళ వాపోయారు. ప్రభుత్వ సహాయం ఆలస్యమవుతుండటంతో స్థానికులే చాలామందిని రక్షించారని, అయితే భారీ కాంక్రీటు స్లాబులు ఎత్తడానికి క్రేన్లు, భారీ యంత్రాల అవసరం ఉందన్నారు.

దేశ చరిత్రలోనే అత్యంత ఘోరమైన విపత్తు..

ఈ ప్రకృతి విపత్తుతో వెనెజువెలాకు ప్రత్యక్షంగా 6.7 బిలియన్ డాలర్ల (రూ.63వేల కోట్ల) మేర నష్టం వాటిల్లిందని ఐరాస అంచనా వేసింది. పరోక్ష ప్రభావాన్నీ లెక్కిస్తే ఇంకా ఎక్కువే ఉండొచ్చని అభిప్రాయపడింది. దీంతో ఆ దేశంలో సంభవించిన అత్యంత ఘోరమైన విపత్తుల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పటికే రాజకీయ అస్థిరత, ఆర్థిక సమస్యల కారణంగా వ్యవస్థలు బలహీనపడ్డాయి. ఇప్పుడు విపత్తు కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులైనప్పటికీ.. వారికి ఆశ్రయం కల్పించలేని పరిస్థితి నెలకొంది. భూకంపాల తీవ్రతవల్ల ఇళ్లలోకి వెళ్లలేనివారు కార్లలోని నిద్రపోతున్నారు. పార్కుల్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. దాదాపు మూడుకోట్ల జనాభా కలిగిన ఆ దేశంలో సగంమందిపైగా పేదరికంలోనే మగ్గిపోతున్నారు. భూకంపాలు రాకముందే 80 లక్షలమంది మానవతా సహాయం అవసరమైన పరిస్థితులున్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

కూతురిని రక్షిస్తూ..

తన కుమార్తెను రక్షిస్తూ వెనెజ్వెలా ఫుట్‌బాలర్ హెక్టర్ బెల్లో భార్య చనిపోయినట్టు ఆయన సోషల్ మీడియా, స్థానిక వార్తల ద్వారా తెలిసింది. భూకంపాల సమయంలో తమ చిన్నారని తన ప్రియాతిప్రియమైన భార్య ఆండ్రియా కాపాడారని బెల్లో ఇన్‌స్టాలో రాశారాని వెనెజ్వెలా వార్తా సంస్థలు తెలిపాయి. "నువ్వు తనను రక్షించిన కథను ఆమెకు చెపుతాను. మన కుమార్తె కోసం నువ్వు నీ జీవితాన్ని ఎలా పణంగా పెట్టావో, ఆమెను ఎన్నడూ వదిలిపెట్టని, చివరకు నీ చివరి శ్వాస తీసుకుంటున్న సమయంలో కూడా బిడ్డను వదలని ధైర్యవంతురాలివని చెబుతాను" అని బెల్లె తన పోస్టులో రాశారు.

# ఆసియాలో జపాన్ భూకంపం!



రెండో ప్రపంచ యుద్ధంలో అణుబాంబుల దెబ్బకు మోకరిల్లిన జపాన్, శాంతి రాజ్యాంగాన్ని రాసుకుని దశాబ్దాల పాటు నిరాయుధంగా నడిచింది. కానీ నేడు అదే జపాన్, మళ్లీ పదునైన కత్తిని చేతపట్టుకుంటోంది. సొంత సీఐఏ నిర్మించుకుంటోంది. హైపర్‌సోనిక్ క్షిపణులు తయారు చేసుకుంటోంది. ఆరోతరం యుద్ధ విమానాలు రూపొందిస్తోంది. ఆసియాలో కొత్త భూకంపం మొదలైంది. అది జపాన్ మేల్కొలుపు!

1945లో రెండో ప్రపంచ యుద్ధంలో పరాజయం తర్వాత, అమెరికా ఆధ్వర్యంలో జరిగిన సంస్కరణలు జపాన్ రాజ్యాంగంలో ఒక విప్లవాత్మక అధ్యాయం రాశాయి. ఆర్టికల్ 9.. యుద్ధాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించిన ఆ నిబంధన ప్రకారం, జపాన్ ఎటువంటి సైనిక దళాలను నిర్వహించకూడదు. దాడి చేసే విధానాలు అనుసరించకూడదు. ఇది ఒక ఓడిపోయిన దేశంపై విజేతలు విధించిన నిబంధన. అయితే శీతల యుద్ధ కాలం నుండి, ముఖ్యంగా 1990ల తర్వాత, జపాన్ ఆ రాజ్యాంగాన్ని క్రమంగా సరళంగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టింది. "సమిష్టి ఆత్మరక్షణ" అనే భావన ద్వారా, దాడికి గురైన మిత్ర దేశాలకు సైనిక సహాయం చేయవచ్చని నిర్వచించుకుంది. జపాన్ సెల్ఫ్-డిఫెన్స్ ఫోర్సెస్ (జేఎస్‌డీఎఫ్) క్రమంగా శక్తిమంతంగా తయారై, అంతర్జాతీయ సైనిక విన్యాసాల్లో పాల్గొనడం ప్రారంభించింది.

షింజో అబే ప్రధానమంత్రిత్వంలో జపాన్ వ్యూహాత్మక దృక్పథం మరింత మారిపోయింది. చైనా సముద్ర విస్తరణ, దూకుడు వైఖరి జపాన్‌లో తీవ్రమైన ఆందోళన రేపాయి. అమెరికా, భారత్, ఆస్ట్రేలియాతో కలిసి క్వాడ్ కూటమి ఆలోచనను ముందుకు తెచ్చింది జపానే. అంతే కాదు, దూర శ్రేణి క్షిపణులు సమకూర్చుకోవడం, నౌకాదళ వేదికలను విమాన వాహక నౌకలుగా మార్చడంవంటి నిర్ణయాలతో జపాన్ శాంతివాద చట్రంనుండి బయటకు అడుగు వేసింది. జాతీయవాద నేతలు "కాలం చెల్లిన శాంతివాద వ్యాఖ్యానాలు మనను బలహీనపరుస్తున్నాయి" అని వాదించారు.

**తాకైచి యుగం: జపాన్ సీఐఏ పుట్టింది**

నేడు జపాన్ ప్రధానమంత్రి సానే తాకైచి, అబే రాజకీయ వారసురాలిగా, ఆయన జాతీయవాద భావజాలాన్ని మరింత బలంగా ముందుకు తీసుకువెళుతున్నారు. చైనా ఇప్పటికే ఆమె భద్రతా వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇటీవల తాకైచి ప్రభుత్వం ఆమోదించిన బిల్లు జపాన్ నిఘా నిర్మాణంలో 70యేళ్ల తర్వాత అత్యంత మహత్తరమైన సంస్కరణగా చరిత్రకెక్కింది. "నేషనల్ ఇంటెలిజెన్స్ కౌన్సిల్" మరియు "నేషనల్ ఇంటెలిజెన్స్ బ్యూరో" పేర్లతో కేంద్రీకృత, నిలువుగా సమన్వయమైన నిఘా వ్యవస్థ నిర్మించబడుతోంది. దీన్నే జపాన్ సొంత సీఐఏగా వర్ణిస్తున్నారు నిపుణులు. ఈ బిల్లుపై 39.1 శాతం ప్రజలు మద్దతిచ్చారు. 41.9 శాతం తటస్థంగా ఉన్నారు. కేవలం 19 శాతం వ్యతిరేకించారు. ప్రజాభిప్రాయం స్పష్టంగా చెబుతోంది -జపాన్ ప్రజలు ఇకపై రాజ్యాంగ సంకెళ్లకు అంతగా కట్టుబడి లేరని.

**చైనా ఆందోళన, గ్లోబల్ టైమ్స్ హెచ్చరిక**

చైనా అనధికారిక వక్త గ్లోబల్ టైమ్స్ పత్రిక ఈ పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిఘా బిల్లు జపాన్ నిఘా విధులను కేవలం దేశీయ భద్రత నుంచి విదేశీ సైనిక నిఘాకు మళ్ళిస్తోందని, విదేశాల్లో గూఢచర్యం, చొరబాటు కార్యకలాపాలను అనుమతిస్తోందని గ్లోబల్ టైమ్స్ ఆందోళన వ్యక్తం చేసింది. నిజంగానే బీజింగ్ వ్యూహకర్తలకు ఇది నిద్రపట్టని సమస్య. జపాన్ యొక్క నైఋతి దీవులు తైవాన్‌కు భౌగోళికంగా సమీపంగా ఉన్నాయి. తైవాన్‌పై చైనా ఏదైనా సైనిక చర్య తీసుకోవాలంటే జపాన్ ప్రతిస్పందనను లెక్కలోకి తీసుకోకుండా ముందుకు వెళ్ళడం సాధ్యం కాదు. జపాన్ దూరశ్రేణి సైనిక సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ, తైవాన్‌పై చైనా లెక్కలు మరింత సంక్లిష్టమవుతున్నాయి.

**అమెరికా వైఖరి మారింది**


ఆసక్తికరమైన విషయమేమిటంటే, 1945లో తాము విధించిన నిబంధనలకే అమెరికా ఇప్పుడు సడలింపు ఇస్తోంది. జపాన్ నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, మేలైన సమాచార మార్పిడి సామర్థ్యాలు పెంచడం, ప్రతి నిఘా నిర్మాణాన్ని మెరుగుపరచడంవంటి అంశాల్లో అమెరికా జపాన్‌కు మద్దతిస్తోంది. కారణం.. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికా ఒంటరిగా అన్నీ భరించలేదు. ఇరాన్, ఉక్రెయిన్ వంటి వివిధ యుద్ధరంగాలలో అమెరికా ఏకకాలంలో సైనిక బాధ్యతలు మోస్తున్న నేపథ్యంలో, చైనా తైవాన్‌పై దాడికి దిగితే సత్వర సైనిక జోక్యం ఎంత సాధ్యమో అనే సంశయం జపాన్‌లో పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జపాన్ సొంత నిరోధక శక్తిని నిర్మించుకోవడం అనివార్యంగా మారింది.

**ఆయుధాల పరంపర**

ఈ వ్యూహాత్మక మార్పు కేవలం కాగితాలపై జరగడం లేదు. జపాన్ ఇప్పటికే ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాలు, టామ్‌హాక్ క్షిపణులు, పేట్రియాట్ మరియు ఏజిస్ క్షిపణి రక్షణ వ్యవస్థలు, అపాచీ దాడి హెలికాప్టర్లువంటి అత్యాధునిక వేదికలను నిర్వహిస్తోంది. అంతేకాదు, సొంత హైపర్‌సోనిక్ ఆయుధాలు, దూర శ్రేణి క్షిపణులు, విద్యుదయస్కాంత రైల్‌గన్లు అభివృద్ధి చేస్తోంది. బ్రిటన్, ఇటలీతో కలిసి ఆరోతరం యుద్ధ విమాన కార్యక్రమం (జీసీఏపీ) ముందుకు సాగుతోంది. ఇవన్నీ కలిసి చూస్తే జపాన్ కేవలం ఆత్మరక్షణకు సిద్ధమవడం లేదు, ప్రాంతీయ శక్తిగా తిరిగి ఆవిర్భవించడానికి పునాదులు వేస్తోందని స్పష్టమవుతోంది. తాకైచి ఇటీవల "సమగ్ర జాతీయ శక్తి దృక్పథం నుండి భద్రతను పరిశీలించే నిపుణుల సమావేశం"లో మాట్లాడుతూ, మరింత అధిక రక్షణ వ్యయం, బలమైన సైనిక సామర్థ్యాల అవసరాన్ని నొక్కి చెప్పారు.

జపాన్ ఈ పరిణామమే ఆసియాలో ఆందోళన కలిగించే అంశం కూడా. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ సామ్రాజ్యవాద దాడులకు బాధపడిన దేశాలు -చైనా, కొరియా, ఇతర ఆగ్నేయాసియా దేశాలు.. ప్రస్తుత మార్పులను అనుమానంగా చూస్తున్నాయి. ముఖ్యంగా "టోక్కో" అనే రహస్య పోలీసు వ్యవస్థ 1911 నుండి 1945 వరకు నిర్వహించిన నాజీ గెస్టపో, సోవియట్ ఎన్‌కేవీడీలతో పోల్చబడిన జపాన్ నిఘా చరిత్ర దృష్ట్యా, కొత్త నిఘా సంస్థ పుట్టుక పొరుగుదేశాలకు పాత పీడకలలు గుర్తుకు తెస్తోంది. అయితే అంతర్జాతీయ వాస్తవాలు మారిపోయాయి. ఉత్తర కొరియా ఉన్మాద అణు కార్యక్రమం, చైనా దూకుడు విస్తరణవాదం, ప్రపంచవ్యాప్త ఉగ్రవాద పరిశ్రమ -ఇవన్నీ జపాన్‌ను తప్పనిసరిగా మారేలా బలవంతం చేశాయని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. "నిరోధం అప్పుడే పని చేస్తుంది, శత్రువుకు మన సామర్థ్యంపై, మన సంకల్పంపై నమ్మకం కలిగినప్పుడు" అని తాకైచి స్పష్టంగా ప్రకటించారు.

జపాన్ పునరుజ్జీవనం ఆసియా భద్రత సమీకరణాలను మొత్తంగా తలకిందులు చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. చైనాకు తల నొప్పి, అమెరికాకు ఊరట, తైవాన్‌కు పరోక్ష రక్షణ కవచం -ఇవన్నీ జపాన్ మిలటరీకరణ ఫలితాలుగా కనిపిస్తున్నాయి. శాంతిని కోరిన దేశం సురక్షితంగా ఉండాలంటే శక్తిని సమకూర్చుకోవాల్సిన అనివార్య స్థితిలో పడింది. చరిత్ర చక్రం మళ్ళీ తిరిగింది. జపాన్ మేల్కొంది. ఆసియా ఉలిక్కిపడింది!! ■



అతిగా పోటీ పడడం, ఎప్పుడూ ఇతరులతో పోల్చుకోవడం నిజంగా ఒక వ్యసనం. అలా చేస్తే మన నిజమైన లక్ష్యం పల్చబడుతుంది. పక్కవారి ఎదుగుదలపైనే ఫోకస్ పెడితే, మనపై మనకు నమ్మకం పోతుంది. సందేహాలు మొదలవుతాయి. తప్పుడు ప్రశ్నలు, తప్పుడు సమాధానాల.. మిశ్రమం నుండి గందరగోళం మాత్రమే మిగులుతుంది. అలాంటి పరిస్థితి నుండి బయటపడటానికి ఒకటే ఉపాయం. ఇతరులతో కాకుండా, నిన్నటి నీతో మాత్రమే పోటీ పడటం, పోల్చుకోవడం. నిన్న నువ్వు ఎక్కడ ఉన్నావో, ఈరోజు ఎక్కడ ఉన్నావో బేరీజు వేసుకో. ఆ మార్పు, ఆ పురోగతే నిజమైన విజయం. ఎందుకంటే, విజయానికి చేరడానికి ఒక్కొక్కరిదీ ఒక్కో మార్గం.. ఒక్కోశైలి ఉంటుంది. సో, నీ శైలి నీదే. నీ సక్సెస్ నీదే!!

-మహాదేవ

**వింతల్లో వింతలు**

## సాగర నగరి!



ఈ ఫ్రీడమ్ షిప్ ఒక మైలు పొడవున్న సముద్ర నగరం! 80,000 మంది కూడా నివసించగలిగే భారీ ఓడ కేవలం సువిహారయాత్ర కాదు -ఇది స్వయంపూర్ణ నగరం. ఆసుపత్రి, విద్యాలయాలు, బ్యాంకులు, దుకాణాలు, రెస్టారెంట్‌లు అన్నీ నౌక లోపలే. 1990లో మొదలైన ఈ కల, కల్పనకు.. ఎట్టకేలకు భౌతిక రూపమిచ్చారు ఇంజనీర్లు. ఫ్రీడమ్ క్రూజ్ లైన్ కంపెనీ ఇంజనీర్ల కలను సాకారం చేయడానికి ఆర్థికంగా సహకరించింది. 16 బిలియన్ డాలర్లు వెచ్చించి తయారు చేసిన ఈ ఓడకు మరి ఏ ఓడా సరిపోలదట. అణు శక్తితో నడిచే ఈ సాగర నగరి -కంటిముందున్న ఓ అద్భుతమనే అనుకోవాలి.

## వికాస్, అభిరథ్ విధ్వంసం..

# హైదరాబాద్ హ్యాట్రిక్

టీజీ20 లీగ్ 2026లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ వరుస విజయాలతో దూసుకుపోతుంది. వరుసగా మూడో మ్యాచ్‌లో విజయం? సాధించి హ్యాట్రిక్ నమోదు చేసింది. ఇవాళ జరిగిన 12వ మ్యాచ్‌లో మెదక్ ఫాల్కన్స్‌పై 46 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్లు అభిరథ్ రెడ్డి (59), వికాస్ రెడ్డి (93) విధ్వంసకర అర్ధ శతకాలతో విరుచుకుపడ్డారు. ఆఖర్లో గడుగు గణేశ్ (22 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మెదక్ బౌలర్లలో విక్రమ్ నాయక్, ఘాజీ అబ్బాస్ చెరో 2 వికెట్లు తీయగా.. వరుణ్, కార్తికేయ, రవితేజ, అశ్విన్ రామ్ తలో వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనను మెదక్ కూడా ధీటుగానే ప్రారంభించినప్పటికీ.. 12వ ఓవర్ తర్వాత ?స్వల్ప విరామాల్లో 6 వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది. అజయ్ దేవ్ గౌడ్ (4-0-20-4), ప్రణవ్ వర్మ (4-0-35-2) అద్భుతంగా బౌలింగ్ చేసి మెదక్‌కు దెబ్బకొట్టారు. శ్రీనికేత్, నితన్ నాయక్ తలో వికెట్ తీశారు. మెదక్ బ్యాటర్లలో విక్రమ్ నాయక్ (75) ఒంటరిపోరాటం చేశాడు. వరుణ్ యెర్రమ్ (38), రవితేజ (31), ఇషాన్ శర్మ (27) రెండంకెల స్కోర్లు చేయగా.. మిగతా ఆటగాళ్లంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. ఈ గెలుపుతో హైదారాబాద్ రన్‌రేట్‌ను భారీగా మెరుగుపర్చుకొని పాయింట్ల పట్టికలో సోలోగా అగ్రస్థానంలో నిలిచింది.



## స్పోర్ట్స్

### నబీకి నాలుగు వికెట్లు..
### భారత్-ఏకు స్వల్ప ఆధిక్యం..!



మొదటి అనధికారిక టెస్టులో భారత ఏ బౌలర్ల ధాటికి రోజున్నరకే శ్రీలంక ఏ ఆలౌటైంది. అకీబ్ నబీ దార్(4-58) పేస్‌ను ఎదుర్కోలేక ఆతిథ్య జట్టు బ్యాటర్లు తోకముడవగా.. 330 రన్స్‌కే కుప్పకూలింది. దాంతో, భారత ఏ జట్టుకు 160 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లోనూ టీమిండియాకు శుభారంభమివ్వాలనుకున్న ఓపెనర్ సాయి సుదర్శన్(7) రిటైర్డ్ హర్టయ్యాడు. ప్రస్తుతం ఆయుష్ పాండే, దేవ్‌దత్ పడిక్కల్ ఆడుతున్నారు. గాలే స్టేడియంలో జరుగుతున్న మొదటి అనధికారిక టెస్టులో భారత ఏ పట్టుబిగించింది. రంజీ వీరుడు అకీబ్ నబీ(4-58) బంతితో విజృంభించగా మూడోరోజే శ్రీలంక ఏ కుప్పకూలింది. ఓవర్ నైట్ స్కోర్ 113/2తో ఇన్నింగ్స్ మొదలెట్టిన లంకను యశ్ ఠాకూర్(2-51) దెబ్బకొట్టాడు. అర్ధశతకంతో విసిగించిన నువనిందు ఫెర్నాండో(84)ను ఔట్ చేసిన ఠాకూర్ వికెట్ల వేటకు తెరతీశాడు. అంజల బండార(70)ను వెనక్కి పంపిన నబీ.. లోయర్ ఆర్డర్‌ను పడగొట్టాడు. నబీ ధాటికి శ్రీలంక ఏ 330 పరుగులకే ఆలౌటైంది.

సాయి, జురెల్ సెంచరీ..

ఓపెనర్ సాయి సుదర్శన్(132), ఆయుష్ పాండే(25)లు భారత ఏ జట్టుకు శుభారంభమిచ్చారు. తొలి వికెట్‌కు 92 రన్స్ జోడించిన సాయి.. ఆ తర్వాత దేవ్‌దత్ పడిక్కల్(12), రుతురాజ్ గైక్వాడ్(22)లతో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. షేక్ రషీద్(63), ధ్రువ్ జురెల్(141 నాటౌట్) మెరవగా.. తొలి రోజే 4 వికెట్ల నష్టానికి 333 రన్స్ కొట్టిన భారత్.. రెండో రోజూ జోరు చూపింది. రషీద్‌తో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన జురెల్ రెండో రోజు లంక బౌలర్లను పరీక్షించాడు. హర్ష్ దూబే(30)తో కలిసి స్కోర్ నాలుగొందలు దాటించాడు. దూబేను గుణశేఖర( 3-84) ఔట్ చేశాక 452-6 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది భారత ఏ.

### విరాట్ కోహ్లికి సంబంధించి బిగ్ న్యూస్

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లికి సంబంధించి ఓ బిగ్ న్యూస్ అందింది. త్వరలో అతడు వన్డే సిరీస్ కోసం ఇంగ్లండ్‌కు వెళ్లాల్సి ఉన్నా, ఇంకా బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లోనే ఉన్నాడు. విరాట్ ఐపీఎల్ 2026 ఫైనల్లో గాయపడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి అతడు పునరావాస కార్యక్రమంలోనే ఉన్నట్లు తెలుస్తోంది.

గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్లో విరాట్ హ్యామ్‌స్ట్రింగ్‌కు గాయమైంది. గాయం ఉన్నప్పటికీ అతడు మొత్తం ఇన్నింగ్స్ ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. అయితే ఆ తర్వాత ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు.

**ఫిట్‌నెస్ క్లియరెన్స్ వచ్చినట్టే.. కానీ..?**

ఇంగ్లండ్ సిరీస్‌కు ముందు విరాట్ జశీజులో ఫిట్‌నెస్ టెస్ట్ పూర్తి చేశాడని, అతడికి క్లియరెన్స్ కూడా లభించిందని పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అందుకే అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అతడిని జట్టులోకి ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే తాజాగా భారత అండర్-19 కెప్టెన్ ఆయుశ్ మాత్రేతో కలిసి విరాట్ జశీజులో కనిపించాడు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో అతడు ఇంకా రిహాబిలిటేషన్‌లోనే ఉన్నాడా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంగ్లండ్‌తో 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జులై 14 నుంచి ప్రారంభమవుతుంది. దీనికి ముందు భారత జట్టు ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతుంది. విరాట్ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం టీమిండియా ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతుంది. ఈ సిరీస్‌లో భాగంగా నిన్న జరిగిన తొలి టీ20లో భారత్ చిత్తుగా ఓడింది. విరాట్‌కు డిస్టల్ సెమిమెంబ్రానోసస్ టెండన్ టియర్ అనే అరుదైన హ్యామ్‌స్ట్రింగ్ గాయం అయినట్లు సమాచారం. ఇది మోకాలి వెనుక భాగంలో ఉండే హ్యామ్‌స్ట్రింగ్ కండరానికి సంబంధించిన గాయం. దీని నుంచి పూర్తిగా కోలుకోవడానికి సాధారణంగా 6 నుంచి 12 వారాలు పట్టే అవకాశం ఉంటుంది. గాయం తీవ్రతను బట్టి కొన్నిసార్లు శస్త్రచికిత్స కూడా అవసరమవుతుంది.

# అప్పటి డేరింగ్ డెసిషన్ ఇప్పటికీ వెంటాడుతుందా?



రస్ట్ కలర్ క్రాప్ టాప్ మరియు వైట్ డెనిమ్ షార్ట్స్‌లో ఆండ్రియా జెరెమియా అద్భుతమైన లుక్



ఒకప్పుడు టాలీవుడ్ హీరోలతో వరుస విజయాలు అందుకుని స్టార్ హీరోయిన్ గా వెలుగొందిన అనుష్క శెట్టి కోసం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. కెరీర్ లో తీసుకున్న ఒక డేరింగ్ డెసిషన్ ఇప్పటికీ ఆమె సినీ జర్నీపై ఎఫెక్ట్ చూపుతోందా అనే చర్చ వినిపిస్తోంది. ముఖ్యంగా ఇటీవల ఆమె సినిమాల సెలక్షన్, ల్యాంగ్ గ్యాప్ లు, కొత్త ప్రాజెక్టులపై క్లారిటీ లేకపోవడం అభిమానులను ఆలోచనలో పడేస్తోంది.అనుష్క ఇండస్ట్రీలోకి రాకముందు యోగా ట్రైనర్ గా వర్క్ చేసిన విషయం తెలిసిందే. బెంగళూరులో చదువుకున్న ఆమె ఫేమస్ యోగా టీజర్ భరత్ ఠాకూర్ వద్ద ట్రైనింగ్ తీసుకున్నారు. నటిగా మారాలనే ఆలోచన లేకుండానే జీవితం సాగుతున్న సమయంలో దర్శకుల దృష్టిలో పడిన ఆమె, 2005లో విడుదలైన సూపర్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరమే రాలేదని చెప్పాలి.విక్రమార్కుడు, అరుంధతి, భాగమతి వంటి చిత్రాలతో నటిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అనుష్క, కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ స్టోరీస్ తో కూడిన చిత్రాల్లోనూ తనదైన క్రేజ్ సంపాదించుకున్నారు. ముఖ్యంగా బాహుబలి సిరీస్ లో దేవసేన రోల్ ఆమెకు పాన్ ఇండియా రేంజ్ లో గుర్తింపు తీసుకొచ్చింది. ఒక జెనరేషన్ ఆడియన్స్ కు ఆమె జేజమ్మ, దేవసేనగా గుర్తుండిపోయారు.అయితే ఆమె కెరీర్ లో టర్నింగ్ పాయింట్ గా నిలిచిన చిత్రం సైజ్ జీరో. ఆ సినిమాలో రోల్ కోసం అనుష్క బాగా బరువు పెరగడం అప్పట్లో అందరి ప్రశంసలు అందుకుంది. పాత్ర కోసం అంతటి డెడికేషన్ చూపించడం ఆమె ప్రొఫెషనలిజానికి ఎగ్జాంపుల్ గా నిలిచింది. కానీ అదే నిర్ణయం తర్వాత ఆమె కెరీర్ పై ప్రభావం చూపిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

బరువు తగ్గేందుకు ప్రయత్నించినప్పటికీ గతంలో ఉన్న ఫిట్ నెస్ ను పూర్తిగా తిరిగి పొందలేకపోయారనే చర్చ సాగుతోంది. ఇటీవలి కాలంలో అనుష్క సినిమాల మధ్య గ్యాప్ కూడా పెరిగింది. రెండు, మూడు సంవత్సరాలకు ఒక సినిమా మాత్రమే చేస్తుండటంతో ఆమె అభిమానులు నిరాశ చెందుతున్నారు. గత ఏడాది విడుదలైన ఘాటిపై భారీ అంచనాలు నెలకొన్నప్పటికీ ఆ చిత్రం ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది.

దీంతో ఆమె తదుపరి ప్రాజెక్టులపై మరింత ఆసక్తి నెలకొంది. ఘాటి విడుదలై నెలలు గడిచినా ఇప్పటివరకు అనుష్క కొత్త తెలుగు మూవీపై అనౌన్స్మెంట్ రాలేదు. కొన్ని డిజిటల్ ప్రాజెక్టులు, వెబ్ సిరీస్‌ల కోసం చర్చలు జరిగినట్లు వార్తలు వచ్చినప్పటికీ అవేం నిజం కాదని తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె చేతిలో కతనార్ అనే మాలీవుడ్ పీరియాడిక్ మూవీ మాత్రమే ఉంది. అయితే ఒకప్పుడు సీనియర్ స్టార్ హీరోల సినిమాల్లో తొలి సెలెక్షన్ అయిన అనుష్కకు ఇప్పుడు ఛాన్సులు తగ్గాయా? లేక సరైన కథ, పాత్ర కోసం ఎదురు చూస్తున్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అయితే నటిగా ఆమెకు ఉన్న గుర్తింపు, అభిమానుల్లో క్రేజ్ ఇప్పటికీ తగ్గలేదు. మంచి కథతో, స్ట్రాంగ్ రోల్ తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తే అనుష్క మరోసారి అదరగొడతారనే నమ్మకం అభిమానుల్లో ఉంది. పాత్ర కోసం తీసుకున్న అప్పటి డేరింగ్ నిర్ణయం ఆమె కెరీర్ ను ఒకవైపు ప్రత్యేకంగా నిలబెట్టినా, మరోవైపు సవాళ్లు కూడా తెచ్చిపెట్టిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరి స్వీటీ ఎప్పుడు పవర్ ఫుల్ కంబ్యాక్ ఇస్తారన్నది వేచి చూడాలి.



నిధి అగర్వాల్ అద్భుతమైన శైలి అందరి దృష్టిని ఆకర్షించింది

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com